# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :68 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: ఆదివారం 11-05-2025 | పేజీలు:4 వెల: 2.00


## ఛార్ ధామ్ యాత్రకు బ్రేక్

ఢిల్లీ : భారత్, పాక్ ల మధ్య ఉద్రిక్తతలు తీవ్రం కావడంతో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. యాత్రికుల క్షేమం దృష్ట్యా ఛార్ ధామ్ యాత్రను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం శనివారం ఉదయం మీడియాకు ఓ ప్రకటన విడుదల చేసింది. పాక్ దాడులు చేసే అవకాశం ఉండడంతో గంగోత్రి, యమునోత్రి, కేదార్ నాథ్, బద్రీనాథ్ ఆలయాల వద్ద భద్రతను కట్టుదిట్టం చేసినట్లు తెలిపింది. యాత్ర ఎప్పటి వరకు రద్దు, తిరిగి ఎప్పుడు ప్రారంభించే విషయాలను త్వరలోనే వెల్లడిస్తామని పేర్కొంది. ఈ ఏడాది చార్ ధామ్ యాత్ర ఏప్రిల్ 30న ప్రారంభమైన విషయం తెలిసిందే. యమునోత్రి, గంగోత్రి ధామ్ తలుపులు ఏప్రిల్ 30న తెరుచుకోగా కేదార్‌నాథ్ ధామ్ తలుపులు మే 2న, బద్రీనాథ్ ధామ్ తలుపులు మే 4న తెరుచుకున్నాయి. ఆన్ లైన్ లో రిజిస్ట్రేషన్ చేసుకున్న భక్తులను యాత్రకు అనుమతిస్తారు. హిందువులకు అత్యంత ముఖ్యమైన ఈ యాత్ర హిమాలయాల్లోని యమునోత్రితో ప్రారంభమై గంగోత్రి, కేదార్ నాథ్ మీదుగా వెళ్లి బద్రీనాథ్ తో ముగుస్తుంది.

## పాక్ సైన్యం సరిహద్దుల దిశగా కదులుతోంది: భారత్



న్యూఢిల్లీ,పాక్ సైన్యం సరిహద్దుల దిశగా కదులుతోందని ఆర్మీ ప్రతినిధి సోఫియా ఖురేషీ పేర్కొన్నారు. భారత్-పాక్ సరిహద్దుల్లో ఘర్షణలపై విదేశాంగశాఖ, మిలిటరీ ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. దీనిలో విదేశాంగశాఖ ప్రతినిధి విక్రమ్ మిస్రీ సైన్యానికి చెందిన కర్నల్ సోఫియా ఖురేషీ , వాయుసేనకు చెందిన వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ పాల్గొన్నారు. తొలుత కర్నల్ సోఫియా ఖురేషీ మాట్లాడుతూ "పశ్చిమ సరిహద్దుల్లో పాక్ నిరంతరం దాడులు చేస్తోంది. డ్రోన్లు, దీర్ఘశ్రేణి ఆయుధాలు, లాయిటరింగ్ మ్యూనిషన్, ఫైటర్ జెట్లను వాడి.. భారత మిలిటరీ స్థావరాలపై దాడులు చేస్తోంది. అయితే వాటిని భారత్ తిప్పికొట్టింది. కానీ, 26 చోట్ల పాక్ ఆయుధాలు గగనతలంలోకి చొచ్చుకొచ్చాయి. అవి ఉధంపుర్, భుజ్, పఠాన్‌కోట్, భఠిండా వాయుసేన స్థావరాల్లోని పరికరాలను దెబ్బతీసి, సిబ్బందిని గాయపర్చాయి. తెల్లవారుజామున 1.40 సమయంలో పాక్ హైస్పీడ్ మిసైల్స్‌తో పంజాబ్‌లోని వాయుసేన స్థావరాలపై దాడులు చేసింది. శ్రీనగర్, అవంతిపుర, ఉధంపుర్‌లో వైద్య కేంద్రాలపై దాడి చేసింది. ఇది రెచ్చగొట్టే చర్య అని కచ్చితంగా తెలుస్తోంది""దీనికి తగినట్లు ప్రతిస్పందిస్తూ.. భారత దళాలు పాక్‌లోని మిలిటరీ స్థావరాలు, రాడార్లు, కమాండ్ కంట్రోల్ సెంటర్లపై దాడులు చేసింది. వీటిల్లో రఫీకీ, మురిద్, చక్లాల, రహిమ్ యార్ ఖాన్, సుక్కుర్, చునియాన్ స్థావరాలు ఉన్నాయి. ఫైటర్ జెట్లతో అత్యంత కచ్చితంగా లక్ష్యాలు ఛేదించే ఆయుధాలు వాడి ఈ దాడులు నిర్వహించాము. పస్రూర్‌లో రాడార్ కేంద్రం, సియాల్ కోట్‌లోని ఏవియేషన్ బేస్‌ను ధ్వంసం చేశాము. ఈ దాడుల సందర్భంగా పౌరులు ప్రాణాలు పోకుండా చాలా జాగ్రత్తలు తీసుకొన్నాం""పాక్ సైన్యం సరిహద్దుల దిశగా కదులుతోంది. ఇది పరిస్థితిని మరింత దిగజార్చే ప్రమాదకర చర్య" అని పేర్కొన్నారు. ఇదే అంశాన్ని వ్యోమికా సింగ్ అంతర్జాతీయ మీడియా కోసం ఆంగ్లభాషలో వెల్లడించారు. భారత స్థావరాలు సురక్షితంగా ఉన్నాయని టైమ్ స్టాంప్‌లు ఉన్న వీడియోలు, ఫొటోలను ప్రదర్శించారు. విదేశాంగశాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ మాట్లాడుతూ.. 'శిర్సా, సూరత్‌ఘర్ వైమానిక స్థావరాలను ధ్వంసం చేశామని పాక్ చెప్పడం పూర్తిగా తప్పు. దీంతోపాటు ఆదంపుర్‌లోని ఎస్-400 , బ్రహ్మోస్ మిసైల్ డిపో, పలుచోట్ల ఎయిర్‌ఫీల్డ్‌లను ధ్వంసం చేసినట్లు తప్పుడు ప్రచారాలు చేస్తోంద"న్నారు. ప్రజలు ఇలాంటి వాటిని నమ్మొద్దని చెప్పారు.

## జనావాసాలపై దాడులతో రెచ్చగొడుతున్న పాక్

న్యూఢిల్లీ,మే10: ఒక పక్క భారత దళాల ధాటికి విలవిలలాడుతున్నప్పటికీ.. పాకిస్థాన్ తన వక్ర బుద్ధి చూపిస్తూనే ఉంది. భారత్ పై మిస్సైళ్లతో దాడికి పాల్పడుతూ రెచ్చగొడుతోంది. జనావాసాలు లక్ష్యంగా దాడులకు పాల్పడుతూ రెచ్చొట్టే చర్యలకు దిగుతోంది. ఢిల్లీ, శ్రీనగర్‌తో పాటు, సరిహద్దు వెంబగి గ్రామాలపై దాడులకు తెగబడుతోంది. ఢిల్లీపై దాడి చేయడమే లక్ష్యంగా చేసిన దాడిని భారత్ సైన్యం ధీటుగా తిప్పికొట్టింది. పాకిస్థాన్ డ్రోన్లను మన సైన్యం ఎప్పటికప్పుడు తిప్పికొడుతున్నా.. మళ్ళీ క్షిపణులు ప్రయోగిస్తోంది. తాజాగా ఢిల్లీని టార్గెట్ చేసుకున్న పాక్.. శనివారం ఫతా 2 క్షిపణి ప్రయోగించింది. అయితే.. ఫతా 2 క్షిపణిని భారతదళాలు కూల్చేసాయి. హర్యానాలోని సిర్సా సమీపంలో భారత వైమానిక రక్షణ దళాలు ఆ క్షిపణిని అడ్డుకుని ధ్వంసం చేసినట్లు సమాచారం. ఫతా 2 క్షిపణి ఉపరితలం నుండి ఉపరితలానికి 400 కిలోమీటర్ల రేంజ్ తో ఉంటుందని తెలుస్తుంది. శనివారం తెల్లవారుజామున, రావల్పిండి లోని నూర్ ఖాన్, పంజాబ్‌లోని చక్వాల్‌లోని మురిద్, షోర్కోట్‌లోని రఫీకితో సహా నాలుగు పాకిస్తాన్ వైమానిక స్థావరాలపై భారత దళాలు దాడి చేసినట్లు సమాచారం. పాకిస్తాన్ వైమానిక స్థావరాలపై దాడి జరిగినట్లు ఆ దేశ డైరెక్టర్ జనరల్ ఇంటర్ సర్వీసెస్ పబ్లిక్ రిలేషన్స్ లెఫ్టినెంట్ జనరల్ అహ్మద్ షరీఫ్ చౌదరి వెల్లడించారు. ఎల్ఓసీ వెంబడి 26 డ్రోన్లు కనిపించాయని.. వీటిలో అనుమానిత సాయుధ డ్రోన్లు ఉన్నాయి. బారాముల్లా, శ్రీనగర్, అవంతిపోరా, నగ్రోటా, జమ్మూ, ఫిరోజ్‌పూర్, పఠాన్‌కోట్, ఫాజిల్కా, లాల్‌గఢ్ జట్టా, జైసల్మేర్, బార్మర్, భుజ్, కుర్బెట్ మరియు లఖీ నాలా ఉన్నాయి. విచారకరంగా, ఫిరోజ్‌పూర్‌లోని పలు ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని డ్రోన్ దాడికి పాల్పడ్డట్టు ప్రభుత్వం తెలిపింది. భారత్‌పై క్షిపణులు, డ్రోన్లతో దాడులకు తెగబడుతున్న పాకిస్థాన్ తాజాగా శ్రీనగర్‌లో మరోసారి భారీ పేలుళ్లు సంభవించినట్లు ఆర్మీ అధికారులు పేర్కొన్నారు. శ్రీనగర్ విమానాశ్రయం సమీపంలో ఉదయం 11.45 గంటల ప్రాంతంలో రెండు భారీ పేలుళ్ల శబ్దాలు వినిపించాయని తెలిపారు. ఈ పేలుళ్ల కారణంగా ప్రజలు భయాందోళనకు గురయ్యారని.. విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని అన్నారు. పేలుళ్ల శబ్దం



వినిపించిన వెంటనే పలు ప్రాంతాల్లో సైరన్లు మోగించి.. ప్రజలను అప్రమత్తం చేశామని పేర్కొన్నారు. అవంతిపురం సమీపంలో ఐదుసార్లు భారీ పేలుడు శబ్దాలు వినిపించినట్లు అధికారులు పేర్కొన్నారు. శ్రీనగర్‌లోని దాల్ సరస్సులో క్షిపణి లాంటి వస్తువు పడినట్లు- గుర్తించామన్నారు. శనివారం తెల్లవారు జామున శ్రీనగర్ విమానాశ్రయంపై.. ఎయిర్ బేస్‌పై డ్రోన్లతో దాడి చేయగా.. సైన్యం వాటిని తిప్పికొట్టింది. సరిహద్దు ప్రాంతాల్లో పాక్ వరుస దాడులకు పాల్పడుతుండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. ప్రజలు బహిరంగ ప్రదేశాల్లో, బాల్కనీల్లో ఉండకుండా ఇళ్లల్లోనే ఉండాలని హెచ్చరించారు. పంజాబ్‌లోని బఠిండాలో అధికారులు రెడ్ అలర్ట్ విధించారు. శ్రీనగర్ ఎయిర్‌పోర్ట్ సమీపంలో పేలుళ్లు సంభవిస్తుండడంతో దానితో సహా ఉత్తర, పశ్చిమ భారత్‌లోని 32 విమానాశ్రయాలను ఈనెల 15 వరకు మూసివేస్తూ కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. భారత్ సరిహద్దుల్లో పాక్ దాడులు కొనసాగుతూనే ఉన్నాయని భారత సైన్యం వెల్లడించింది. అమృత్ సర్ ఖాసా కంటోన్మెంట్‌పైకి పాక్ డ్రోన్‌లు ప్రయోగించిందని, పాక్ డ్రోన్లను వచ్చినవి వచ్చినట్లు సమర్థంగా కూల్చివేశామని స్పష్టం చేసింది. సాధారణ పౌరులపై దాడులు ఆమోదనీయం కాదని పేర్కొంది. ఎలాంటి దాడులనైనా భారత సైన్యం దీటుగా ఎదుర్కొవడానికి సిద్ధంగా ఉందని బదులిచ్చింది.

## పాకిస్తాన్‌కు ఐఎంఎఫ్ రుణం.. ఆందోళన వ్యక్తం చేసిన సీఎం ఒమర్ అబ్దుల్లా

జమ్ము కశ్మీర్: అంతర్జాతీయ ద్రవ్య నిధి పాకిస్తాన్‌కు బిలియన్ డాలర్ల రుణం ఇవ్వడంపై జమ్మూ కశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ఆందోళన వ్యక్తం చేశారు. రుణం ఇవ్వడం వల్ల భారత్-పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తతలు తగ్గబోవన్నారు. పూంచ్, రాజౌరి, ఉరి, తంగ్ధర్ తదితర ప్రాంతాల్లో దాడి చేసేందుకు వినియోగిస్తున్న మందుగుండు సామగ్రి ఖర్చులను ఐఎంఎఫ్ చెల్లిస్తున్నప్పుడు.. ఉపఖండంలో ప్రస్తుత ఉద్రిక్త పరిస్థితులు ఎలా తగ్గంచవచ్చని అంతర్జాతీయ సమాజం భావిస్తుందో తనకు తెలియడం లేదన్నారు. సరిహద్దుల్లో పాక్ చేస్తున్న దాడులకు ఐఎంఎఫ్ నిధులు ఎలా ఉపయోగపడుతున్నాయో పేర్కొన్నారు. ఐఎంఎఫ్ మంజూరు చేసిన రుణం కారణంగా పాక్ సైనిక చర్యలకు ఊతమిస్తుందని.. దాంతో జమ్మూ కశ్మీర్‌లో శాంతికి విఘాతం కలిగిస్తుందన్నారు. ప్రస్తుతం సోషల్ మీడియా వేదికగా చేసిన వ్యాఖ్యలు సర్వత్రా చర్చనీయాంశంగా మారాయి.ఇదిలా ఉండగా.. పాకిస్తాన్‌కు బిలియన్ డాలర్ల రుణాన్ని విడుదల చేయడానికి అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ (ఐఎంఎఫ్) శుక్రవారం ఆమోదం తెలిపింది. ఐఎంఎఫ్ బోర్డు సమావేశం శుక్రవారం వాషింగ్టన్‌లో జరిగింది. పాక్‌కు ఉద్దీపన ప్యాకేజీపై జరిగిన ఓటింగ్‌కు భారత్ దూరంగా ఉంది. గతంలో ఇచ్చిన ఆర్థిక సహాయాన్ని సమర్థంగా ఉపయోగించుకోవడంలో ఐఎంఎఫ్ షరతులను పాటించడంలో పాక్ పదేపదే విఫలమవుతున్నదని తెలిపింది.



పాకిస్థాన్‌తో ఉద్రిక్తతలు తీవ్రరూపం దాలుస్తున్న తరుణంలో భారత్ ఈ నిర్ణయం తీసుకుంది. పాకిస్థాన్‌కు అందచేస్తున్న రుణాలు సైనిక నిఘా కార్యకలాపాలకు, భారత భూభాగంపై దాడులు నిర్వహించిన లష్కరే తాయిబా, జైషే మహమ్మద్ వంటి ఉగ్ర గ్రూపులకు పరోక్షంగా సాయపడుతున్నాయని భారత్ మొదటినుంచి వాదిస్తూ వస్తోంది. సీమాంతర ఉగ్రవాదాన్ని అంతం చేయడానికి పటిష్టమైన చర్యలు తీసుకోనంత వరకు పాక్‌కు ఆర్థిక సహకారం అందచేయవద్దని ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకు వంటి అంతర్జాతీయ ఆర్థిక సంస్థలకు విజ్ఞప్తి చేస్తూ వస్తున్నది.

## ఇండియా-పాకిస్తాన్ వార్ ఎఫెక్ట్.. హైదరాబాద్‌లో బాణసంచా కాల్చడంపై నిషేధం!



హైదరాబాద్,భారత్, పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో దేశ వ్యాప్తంగా ప్రధాన నగరాలు హై అలర్ట్ అయ్యాయి. ఈ క్రమంలోనే హైదరాబాద్ పోలీసులు కూడా అలర్ట్ అయ్యారు. నగరంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ కీలక నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. భారత్-పాక్ మధ్య యుద్ధ పరిస్థితులు సద్దుమణిగే వరకు హైదరాబాద్ నగరంలో బాణాసంచా కాల్చడాన్ని నిషేధిస్తూ ఆదేశాలు జారీ చేసినట్టు సమాచారం. ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత్ పాక్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు తీవ్ర స్థాయికి చేరాయి. ఈ ఆపరేషన్ తర్వాత పాక్ భారత్‌లోని ప్రధాన నగరాల లక్ష్యంగా ప్రతీకార దాడులకు పాల్పడుతోంది. ఇప్పటికే భారత్ సరిహద్దు నగరాల్లో డ్రోన్లు, మిస్సైళ్లతో దాడులకు పాల్పడిన పాక్.. దేశ రాజధాని ఢిల్లీ సహా దేశంలోని ప్రధాన నగరాలను టార్గెట్ చేసినట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో హైదరాబాద్ పోలీసులు అలర్ట్ అయ్యారు. నగరంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నారు. ఈ క్రమంలోనే హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ కీలక నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. భారత్-పాక్ మధ్య యుద్ధ పరిస్థితులు సద్దుమణిగే వరకు హైదరాబాద్ నగరంలో బాణాసంచా కాల్చడాన్ని నిషేధిస్తూ ఆదేశాలు జారీ చేసినట్టు సమాచారం. భారత్-పాక్ మధ్య యుద్ధ వాతావరణ పరిస్థితులు ఉన్న నేపథ్యంలో నగరంలో బాణాసంచా కాల్చడం ప్రజలను భయాందోళనలకు గురిచేస్తోందని ఆయన అభిప్రాయ పడ్డారు. బాణా సంచా శబ్దాలు సైతం పేలుళ్ల సంభవించినప్పుడు ఏర్పడే శబ్దాల వలే ఉండటంతో, ఇవి ప్రజల్లో ఆందోళనలు రేకెత్తించేందుకు దారితీయొచ్చని ఆయన భావించారు. ప్రజల్లో భయాందోళనలు తొలగించడం, శాంతిభద్రతలను కాపా డటం వంటి లక్షాలతోనే సీపీ సీవీ ఆనంద్ ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోం ది. అయితే ఈ ఆంక్షలు వెంటనే అమల్లోకి వస్తాయని సీవీ ఆనంద్ తెలిపారు. పాక్-భారత్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు సద్దుమణిగే వరకు ఈ ఆంక్షలు అమల్లో ఉంటాయని ఆయన చెప్పినట్టు తెలుస్తోంది. అయితే ఎవరైన ఈ ఆంక్షలను ఉల్లంఘించి బాణసంచా కాల్చినట్టు తెలుస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించినట్టు సమాచారం. ప్రస్తుతం దేశంలో నెలకొన్న పరిస్థితులను దృష్ట్యా అందరూ ఈ నిషేధాన్ని పాటిస్తూ పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు.

## భారత్ దాడితో పాక్‌లో వణుకు..సైనికదాడి ఆపితే మేమూ దిగివస్తాం



ఇస్లామాబాద్,మే10: భారత్ తమపై దాడి చేస్తే ఎదురుదాడికి దిగుతామని మేకపోతు గాంభీర్యం ప్రదర్శించిన పాక్ ఇప్పుడు మాట మార్చేసింది. పాక్ విదేశాంగ శాఖ మంత్రి ఇషాక్ దార్ మీడియాతో మాట్లాడుతూ.. భారత్ తమపై చేస్తున్న సైనిక దాడిని ఇక్కడితో ఆపితే తాము కూడా ఉద్రిక్తతలు తగ్గించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. పాకిస్తాన్ విదేశాంగమంత్రి ఇషాక్ దర్ ఈ మేరకు కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్ దాడులు ఆపితే తాము ఆపుతామని ఇషాక్ దర్ స్పష్టం చేశారు. రెండు దేశాల మధ్య ఉద్రక్తతల నేపథ్యంలో తాము తగ్గింపునకు సిద్ధంగా ఉన్నామని, అయిత భారత్ దాడులు ఆపితే తాము తగ్గుతామని పేర్కొన్నారు. ఇదే విషయాన్ని అమెరికాకు స్పష్టం చేశామని వివరించారు. ఇరుదేశాల మధ్య దాడుల వల్ల పాక్ ఆర్థిక పరిస్థితి కుదేలవ్వడం, ప్రజల పరిస్థితులు అధ్వానంగా మారే ప్రమాదం ఉండడంతో.. ఈ యుద్ధ వాతావరణాన్ని రూపుమాపడం కోసం న్యూఢిల్లీతో చర్చలు జరపడానికి ఇస్లామాబాద్ సిద్ధంగా ఉందని పాక్ అధికారిక వర్గాలు వెల్లడించాయి. భారత్-పాక్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో పరిస్థితులు చేయి దాటకముందే దాడుల నివారణకు చర్యలు తీసుకోవాలని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో ఇరుదేశాలకు సూచించారు. ఈ నేపథ్యంలో పాక్ విదేశాంగశాఖ మంత్రి ప్రకటన ప్రాధాన్యం సంతరించుకుంది. గురువారం రాత్రి నుంచి పాక్ భారత సరిహద్దు ప్రాంతాల్లో దుస్సాహసానికి ఒడిగడుతూనే ఉంది. బారాముల్లా నుంచి భుజ్ వరకు 26 ప్రాంతాల పైకి వరసగా డ్రోన్లు ప్రయోగించింది. ముఖ్యంగా శ్రీనగర్ విమానాశ్రయాన్ని, అవంతీపొరా వైమానిక స్థావరాన్ని లక్ష్యంగా చేసుకొని డ్రోన్లను ప్రయోగిస్తూ.. విఫలయత్నిం చేస్తుండగా, దాయాది చర్యలను భారత సైన్యం తిప్పి కొడుతోంది. శనివారం మరోసారి జమ్మూ, ఫిరోజ్‌పుర్, పఠాన్‌కోట్, జైసల్మేర్, బాడ్‌మేడ్, భుజ్ తదితర ప్రాంతాలపై వీటిని మళ్లీ పంపేందుకు ప్రయత్నించగా భారత సైనికులు వాటిని కూల్చివేశారు.

## ప్రజలు ఆందోళనలో.. అందాల పోటీల బిజీల్లో సీఎం

హైదరాబాద్: ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా దేశ రక్షణ కోసం మన సైన్యం పోరాడుతున్న తీరు స్ఫూర్తిదాయకమని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద అన్నారు. దేశ ప్రజలంతా సైన్యానికి సంఘీభావం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. పాక్ దాడిలో అమరుడైన ఏపీ జవాన్ మురళీ నాయక్‌కు బీఆర్ఎస్ ఘనంగా నివాళులర్పిస్తున్నదని చెప్పారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్వీ అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్, కురువ విజయ్ కుమార్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. అందాల పోటీలకు బీఆర్ఎస్ వ్యతిరేకం కాదన్నారు. అందాల పోటీలు ఆహ్లాదకరమైన వాతావరణంలో జరగాలని, యుద్ధ వాతావరణంలో కాదని చెప్పారు. మిస్ వరల్డ్ పోటీలకు మూడంచెల భద్రత కల్పిస్తామని ప్రభుత్వం షెడ్యూల్ కూడా ప్రకటించింది, అత్యవసర సేవలు యుద్ధక్షేత్రంలో ఉండాలి కానీ, అందాల పోటీల్లో కాదని వెల్లడించారు. రేవంత్ పాలనలో రాష్ట్రం పిచ్చోడి చేతిలో రాయిలా మారిందని విమర్శించారు. సలహాదారులు ముఖ్యమంత్రికి ఏం సలహాలు ఇస్తున్నారో అర్థం కావడం లేదని చెప్పారు. ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో కగార్‌ను కూడా నిలిపి వేశారు. కగార్‌లో పాల్గొంటున్న బలగాలను కేంద్రం అత్యవసరంగా వెనక్కి పిలిచింది . సైన్యానికి సంఘీభావంగా దేశమంతా ర్యాలీలు జరుగుతుంటే సీఎం మాత్రం అందాల పోటీలు, క్యాట్‌వాక్ పోటీల్లో బిజీగా ఉన్నారని ఎద్దేవా చేశారు. దేశవ్యాప్తంగా అనేక విమానాశ్రయాలు, పోర్టులను కూడా మూసి వేశారని, నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతాయని ప్రజలు ఆందోళనలతో ఉన్నారని తెలిపారు. ప్రజల భయాందోళనలు నివృత్తి చేయాల్సిన సీఎం రేవంత్ అందాల పోటీల బిజీలో ఉన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అందాల పోటీలు రాష్ట్ర భవిష్యత్‌కు కీలకమని ఓ చీఫ్ సెక్రటరీ స్థాయి అధికారి మాట్లాడొచ్చా అని ప్రశ్నించారు. సీఎం రేవంత్ తెలంగాణ పరువును దిగజారుస్తున్నారని విమర్శించారు. పాలన అంటే చిన్న పిల్లల ఆటనా అని మండిపడ్డారు. అభినవ నీరో



రేవంత్ రెడ్డి .. మన విద్యార్థులు పంజాబ్, శ్రీనగర్ నుంచి సొంత స్థలాలకు రావాలనుకుంటున్నారు. వారిగురించి ఒక్కసారైనా ఆలోచించారా అని ప్రశ్నించారు. అలో లక్ష్మణా అని ఓ వైపు రైతులు అల్లాడుతుంటే.. సీఎం రేవంత్ అందాల పోటీలు అంటూ వెంపర్లాడుతున్నారు . సీఎం ఆలోచనా విధానం మారాలి. అందాల పోటీలను తక్షణమే ఆపాలని డిమాండ్ చేశారు.

### సరిహద్దు ఉద్రిక్తతలతో విద్యార్థుల ఆందోళన

శ్రీనగర్, భారత్-పాక్ మధ్య ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో శ్రీనగర్‌లోని షేర్-ఇ-కశ్మీరీ వ్యవసాయ విజ్ఞాన, సాంకేతిక విశ్వవిద్యాలయంలో విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నారు. ఇందులో 300 మందికిపైగా విద్యార్థులు ఉండగా.. వీరిలో పలువురు తెలుగు రాష్ట్రాల విద్యార్థులు ఉన్నారు. సరిహద్దుల్లో బాంబుల మోతతో ఆందోళన చెందుతున్నట్లు విద్యార్థులు చెబుతున్నారు. తమను వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని కోరుతున్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు ఏపీ, తెలంగాణ విద్యార్థులు లేఖ రాశారు. దీంతో కేంద్ర మంత్రి తక్షణమే స్పందించారు.


## మావోల వేటకు విరామం.. బార్డర్‌కు బలగాలు

వరంగల్, మే 10: మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా కొనసాగుతున్న ఆపరేషన్ కగార్‌కు తాత్కాలిక బ్రేక్ పడింది. ఆపరేషన్ కగార్‌పై ఆపరేషన్ సిందూర్ ఎఫెక్ట్ పడింది. భారత్ – పాకిస్థాన్ వార్ నేపథ్యంలో కేంద్రం సంచలన నిర్ణయం తీసుకుంది. మావోయిస్టులను ఏరివేసేందుకు కర్రెగుట్టలను జల్లెడ పడుతున్న సీఆర్పీఎఫ్ బలగాలు వెనక్కి రావాల్సిందిగా కేంద్రం ఆదేశించింది. దీంతో కర్రెగుట్టల్లో మావోయిస్టుల వేటకు విరామం పడింది. దాదాపు ఐదు వేల మందికి పైగా బలగాలను కేంద్రం వెనక్కి రిప్పిస్తోంది. కర్రెగుట్టల నుంచి బలగాలు వెనక్కి వెళ్తున్నాయి. తెలంగాణ – ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని సీఆర్‌పీఎఫ్ కోబ్రా జవాన్లను తమ హెడ్ క్వార్టర్స్‌లో రిపోర్ట్ చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. దీంతో కేంద్ర బలగాలు హుటాహుటిన వెనుతిరుగుతున్నాయి.ములుగు జిల్లాలోని వెంకటాపురం, ఆలూబాక, వీరభద్రవరం పెద్దగుట్ట పరిసరాల్లో మోహరించిన బలగాలకు రిలీవ్ ఇచ్చారు. కేంద్రం ఆదేశాల మేరకు రేపు (ఆదివారం) ఉదయంలోగా భారత్– పాక్ బార్డర్‌కు బలగాలు వెళ్లనున్నాయి. కాగా.. వచ్చే ఏడాది మార్చి నాటికి మావోయిస్టులు లేకుండా చేయడమే లక్ష్యంగా చేపట్టిన ఆపరేషన్ కగార్ దూకుడుగా సాగుతోంది. ఆపరేషన్ కగార్‌లో జరిగిన



భారీ ఎన్‌కౌంటర్‌లో భారీగా మావోయిస్టులు ప్రాణాలు కోల్పోయారు. వారిలో పలువురు అగ్రనేతలు కూడా ఉన్నారు. గత కొద్దిరోజులుగా ఆపరేషన్ కర్రెగుట్టలు పేరుతో మావోయిస్టులను ఏరివేసేందుకు భద్రతా బలగాలు కర్రెగుట్టలపై సెర్చ్ కొనసాగిస్తున్నాయి. మావోయిస్టు అగ్రనేతలే టార్గెట్‌గా ఆపరేషన్ కర్రెగుట్టల్లో పెద్ద ఎత్తున కూబింగ్ కొనసాగిస్తున్నారు. 145 ఎకరాల విస్తీర్ణం ఉన్న కర్రెగుట్టల చుట్టూ దాదాపు పదివేల మంది భద్రతా బలగాలు మోహరించి ఉన్నాయి.

# పీవోకే స్వాధీనం తప్పదా?




జమ్ము కశ్మీర్: పహల్గాంలో నిస్సహాయులైన 26 మంది పర్యాటకులను పొట్టన పెట్టుకున్న ఉగ్ర దాడులపై ప్రతీకార చర్యగా భారత బలగాలు మే 7వ తేదీ తెల్లవారుజామున ప్రతి దాడి సల్పి నూటికి నూరు శాతం లక్ష్యాలను పూర్తి చేశాయి. మన త్రివిధ బలగాలు సంయు క్తంగా చేసిన ఈ చర్య ఉగ్రదాడిలో సమిధులైన కుటుంబాలకు శాంతింప చేసింది. అంతే కాకుండా ఉగ్రవాద చర్యలతో కుతకుత ఉడుకుతున్న భారత ప్రజల హృదయాలను కూడా ఇది చల్లబర్చింది. మరోసారి ఉగ్రవాద ప్రాయో జిత కుట్రలకు పాకిస్తాన్ తలపడాలన్నా సరే వెనుకా ముందూ ఆలోచించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. బాధితుల, ప్రజల ఆగ్రహాన్ని, ఆవేదనను నిజంగానే శాంతింపజేసిన చర్య ఇది. భారత సాయుధ దళాలు కేవలం 25 నిమిషాల పాటు ఉగ్రవాద సంస్థల స్థావరాలను లక్ష్యంగా చేసుకొని రఫెల్ యుద్ధ విమానాలు, స్కాల్ప్, హామ్మర్ మిస్సైల్స్ ద్వారా సైనిక దాడులు చేసారు. ఈ దాడులతో పాకిస్తాన్ ఇంకా తేరుకోలేదు.

కఠిన నిర్ణయాలతో పాక్‌కు షాక్!

ఏప్రిల్ 22న జరిగిన సంఘటన తర్వాత దేశ ప్రజలను శాంతింప చేయడానికి ప్రభుత్వం కొన్ని కఠినమైన నిర్ణయాలను ప్రకటించింది. ముఖ్యంగా 1960లో కుదుర్చుకున్న ఇండస్ వాటర్ ఒప్పందాన్ని నిలిపివేసింది. పాకిస్తానీ వీసాలను రద్దు చేయడం, సరిహద్దులను మూసివేయడం, రాయబారులను తగ్గించడంతో పాటు తమ గగనతలాన్ని మూసివేసింది. నాటినుండి ఇండియా పాకిస్తాన్ సరిహద్దుల్లో యుద్ధ వాతావరణం నెలకొంది. పూర్తి స్థాయిలో కాకున్న ప్పటికీ ఇరుదేశాల మధ్య యుద్ధం జరిగే అవకాశాలు ఉన్నట్లు కనిపిస్తోంది.

ప్రపంచ దేశాల మద్దతు మనవైపే!

ఈ ఆపరేషన్ సిందూర్ విజయవంతంగా చేపట్టాకా అమెరికాతో పాటు, ఇజ్రాయెల్, ఫ్రాన్స్, ఇటలీ, ఇరాన్, రష్యా, యూఏఈ, సౌదీ అరేబియా, భూటాన్, శ్రీలంక, ఆఫ్ఘనిస్తాన్, బంగ్లాదేశ్, మాల్దీవ్స్ మొదలైన దేశాలు భారతదేశానికి బాసటగా నిలబడగా ఐక్యరాజ్యసమితి ఈ సంఘటనను ఖండిస్తూనే సంయమనం పాటించాల్సిందిగా కోరింది. అయితే ఐక్యరాజ్యసమితి ఉగ్రవాదాన్ని నిర్మూలించడంలో విఫలం అయిందని భారత్ అభిప్రాయపడింది. ఐతే, చైనా కూడా పూర్తి స్థాయిలో పాకిస్తాన్‌కు మద్దతు ఇచ్చే పరిస్థితిలో ఉన్నట్లు కనిపించడం లేదు. ఇదివరకే మనకు పాకిస్తాన్ దేశంతో నాలుగు సార్లు 1948, 1965, 1971, 1999లో యుద్ధం చేసిన అనుభవం ఉంది. అయితే, గతంలో కన్నా భిన్నంగా పాకిస్తాన్‌లోని మూడు ప్రాంతాలలోని ఉగ్రశిబిరాలపై, పీఓకేలోని ఉగ్ర శిబిరాలపై భారత్ సైనిక ఆపరేషన్ చేసింది. పాకిస్తాన్ సైనిక స్థావరాలపై గాని, పాకిస్తాన్ పౌరులపై గాని దాడులు చేయలేదు, అందుకే ప్రపంచంలోని అన్ని దేశాలు మన చర్యను ప్రశంసించాయి. అలాగే, చైనా కూడా భారత్ చర్య విచారకరం అని పేర్కొందే తప్ప వ్యతి రేకించలేదు.

ముందస్తు చర్యగా మాక్ డ్రిల్

మనం అంతర్జాతీయంగా మద్దతు కోసం మన మిత్ర దేశాలతో చర్చలు జరుపుతుండగా మరోవైపు పాకిస్తాన్ మాత్రం ఆధీన రేఖ వెంబడి కాల్పుల జరుపుతుంది. అందుకే ముందస్తు చర్యగా మన ప్రభుత్వం ఆపరేషన్ అభ్యాస్‌గా పిలువబడే అతి పెద్ద సైనిక డ్రిల్ దేశవ్యాప్తంగా ఢిల్లీ, హైదరాబాద్, వైజాగ్, తారాపూర్ నగరాలతో సహా 244 జిల్లాల్లో నిర్వహించింది. హైదరాబాద్ భారతదేశానికి వ్యూహాత్మకంగా నగరం. ఇక్కడ %ణ=ణూ%, మిధాని, HAL, NFC, ఏరోస్పేస్ వంటి రక్షణ, పరిశోధన సంస్థలతో పాటు, ముఖ్యమైన IT సంస్థలున్నాయి. ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్న నగరం కావున హైదరాబాద్‌పై దాడులు జరిగే అవకాశం ఉంటుందని హెచ్చరిస్తుంది కేంద్రం.

పీవోకే స్వాధీనం తప్పదా?

పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్ తమదే అని దానిని తిరిగి పొందుతామని గత కొంత కాలంగా మన ప్రభుత్వం చేస్తున్న ప్రకటనల నేపథ్యంలో ఆ దిశగానే మన ప్రభుత్వం అడుగులు వేసే అవకాశం ఉంది. గతంలో మనం సర్జికల్ దాడులు చేశాం. రెండు దేశాలు కూడా అణ్వాయుధాలను కలిగిన దేశాలు.. అయితే వీటిని ఉపయోగించే అవకాశాలు మాత్రం తక్కువే. పాకిస్థాన్ ఒకవైపు బలూచిస్తాన్ లిబరేషన్ ఆర్మీతో అంతర్గత వేర్పాటు పోరుతో సతమతమవుతుండగా, మరోవైపు జనావాసాలపై ఉగ్రవాదుల దాడులు, దానికి తోడు ఆర్థిక సమస్యలు అలాగే ఆఫ్ఘానిస్తాన్‌తో పోరుతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న తరుణంలో భారతదేశంతో యుద్ధం చేయడం సాధ్యం కాదు. దానికి ప్రపంచ దేశాల మద్దతు కూడా ఉండదు. ఇది గ్రహించి ఉగ్రవాదులను ఏరివేయడంలో కీలక లక్ష్యాల సాధన వైపు భారత్ అడుగులేయాలి.

# సరిహద్దుల్లో యుద్ధ మేఘాలు

న్యూఢిల్లీ,పాకిస్థాన్‌తో తీవ్ర ఉద్రిక్తత పరిస్థితుల నేపథ్యంలో భారత ఆర్మీ చీఫ్‌కు కేంద్రం మరిన్ని అధికారాలను అప్పగించింది. డ్రోన్లు, మిస్సైల్స్‌తో దాడులు చేసిన పాక్‌ను భారత్ సమర్థంగా అడ్డుకొంది. ఆ రెండూ విఫలం కావడంతో పాక్ మరో కుతంత్రానికి తెరదీసేందుకు ప్రయత్నిస్తున్నట్లు- తెలుస్తోంది. సరిహద్దు ప్రాంతాల్లో దాడులు చేసి భారత్‌ను ఇబ్బంది పెట్టాలనేదే పాక్ పన్నాగం. దీంతో ఆ దేశానికి అలాంటి అవకాశం ఇవ్వకుండా భారత ఆర్మీని మరింత దృఢంగా తయారు చేసేందుకు కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు భారత ఆర్మీ చీఫ్‌కు మరిన్ని అధికారాలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అవసరమైతే టెరిటోరియల్ ఆర్మీని రంగంలోకి దించాలని స్పష్టం చేసింది. ఇందులోని అధికారులను, నమోదు చేసుకున్న సిబ్బందిని పిలిచేందుకు అధికారం కల్పించింది. రెగ్యులర్ ఆర్మీతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉండాలని కేంద్రం సూచించింది. ఇప్పటి వరకు పలు సందర్భాల్లో -టె-రిటోరియల్ ఆర్మీ సిబ్బంది యుద్ధాల్లో పాల్గొంది. 1962, 1965, 1971 యుద్ధాల్లో భారత సైన్యంతో కలిసి పనిచేశారు. ప్రకృతి వైపరీత్యాల సందర్భంగానూ సేవలు అందించారు. ఇటీవల కేరళ వరదల్లో స్టార్ నటుడు మోహన్ లాల్ తనవంతు సేవలు అందించిన సంగతి తెలిసిందే. అతడు కూడా టెరిటోరియల్ ఆర్మీలో లెఫ్టినెంట్ కర్నల్ స్థాయి అధికారి. ఈ జాబితాలో పలువురు సెలబ్రిటీలు కూడా ఉన్నారు. భారత మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ, సచిన్ పైలట్, కపిల్ దేవ్, అనురాగ్ ఠాకూర్, అభినవ్ బింద్రా.. లెఫ్టినెంట్ కర్నల్ స్థాయిలో ఉన్నారు. కనీస అర్హత సర్వీస్ పూర్తి చేసిన వారికి పింఛనుతోపాటు- ఇతర ప్రయోజనాలు అందిస్తారు. టె-రిటోరియల్ లేదా ప్రాదేశిక ఆర్మీ గురించి సింపుల్‌గా చెప్పాలంటే సైనిక రిజర్వ్ ఫోర్స్. దేశంలో క్లిష్టపరిస్థితులు ఎదురైనప్పుడు భారత ఆర్మీతో కలిసి ప్రత్యర్థితో తలపడేందుకు టెరిటోరియల్ ఆర్మీ సిద్ధంగా ఉంటుంది. ఇందులోని సిబ్బంది, అధికారులకు రెగ్యులర్ ఆర్మీ తరహాలోనే శిక్షణ ఇస్తారు. వీరంతా బయట ఉద్యోగాలు చేసుకుంటూనే వాలంటరీగా సైన్యంతో పనిచేస్తుంటారు. 1948లో భారత టెరిటోరియల్ ఆర్మీ చట్టం ఆమోదించారు. ఆ తర్వాత 1949లో అధికారికంగా ప్రారంభమైంది. ప్రస్తుతం దాదాపు 50 వేల మంది వరకు ఈ ఆర్మీలో ఉన్నట్లు సమాచారం. వీరంతా రెగ్యులర్ ఆర్మీలో భాగమే అయినప్పటికీ.. నిరంతరం సైన్యంతోనే ఉండరు. అవసరమైన సందర్భాల్లో కదన, ప్రకృతి వైపరీత్యాల్లో రంగంలోకి దిగుతారు. -టె-రిటోరియల్ ఆర్మీ అధికారుల్లో పలువురు శౌర్య, విశిష్ఠ పురస్కారాలను అందుకొన్నారు.

## మురళీ నాయక్ కుటుంబానికి బాబుపరామర్శ


అమరావతి, భారత్ - పాకిస్థాన్ యుద్ధ భూమిలో వీరమరణం పొందిన తెలుగు జవాన్ మురళీ నాయక్ కుటుంబాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఫోన్‌లో పరామర్శించారు. దేశ రక్షణలో పెనుకొండ నియోజకవర్గం గోరంట్ల మండలం కల్లితండాకు చెందిన మురళీ నాయక్ ప్రాణాలు కోల్పోవడంపై ముఖ్యమంత్రి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మురళీ నాయక్ తల్లిదండ్రులు జ్యోతిబాయి, శ్రీరాం నాయక్‌లతో ఫోన్‌లో మాట్లాడి పరామర్శించారు. మాతృభూమి కోసం ప్రాణాలు అర్పించిన మురళీ త్యాగాన్ని దేశమంతా గుర్తుపెట్టుకుంటుందన్నారు. 25 ఏళ్ల వయసులోనే దేశం కోసం అమరుడైన మురళీ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని స్పష్టం చేశారు. వీరజవాన్ మురళి తల్లిదండ్రుల ఆవేదన తీర్చలేనిదని.. వారు ధైర్యంగా ఉండాలని కోరుతున్నానని సీఎం చంద్రబాబు అన్నారు. ఆపరేషన్ సిందూర్‌లో వీర మరణం పొందిన జవాన్ మురళీ నాయక్ త్యాగాన్ని భారత జాతి ఎన్నడూ మరచిపోదని డిప్యూటీ- సీఎం పవన్ కళ్యాణ్ అన్నారు. జమ్ము కశ్మీర్ సరిహద్దుల్లో శత్రు మూకలతో పోరాడి మరణించిన మురళీ నాయక్ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నానని తెలిపారు. శ్రీ సత్యసాయి జిల్లా కల్లి తండాకు చెందిన ఈ యువ జవాన్ దేశ రక్షణకు అంకితమై, సమర భూమిలో అమరులయ్యారన్నారు. ఈ వీరుడి తల్లితండ్రులు జ్యోతి బాయి, శ్రీరామ్ నాయక్, ఇతర కుటు-ంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా ఆ కుటుంబానికి భరోసా ఇస్తుందని ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు.

# ఉద్యోగులలో మార్పు ?

అమరావతి,రాష్ట్రాల స్థాయిలో చూసుకుంటే ఏ ప్రభుత్వం అయినా మారడానికి ప్రభుత్వ ఉద్యోగులు కీలక పాత్ర పోషిస్తారు అని అంటారు. చరిత్ర కనుక చూస్తే ఇదే సత్యం అని కూడా అనిపిస్తుంది. ప్రభుత్వ ఉద్యోగులు ఏకంగా మూడున్నర దశాబ్దాలకు పైగా సర్వీసులో ఉంటారు. అంటే వారి సర్వీస్ కాలంలో ఏడు నుంచి ఎనిమిది దాకా సార్వత్రిక ఎన్నికలను చూస్తారు. ఇక వారు ప్రభుత్వంలో కీలకమైన భాగం. వారు తలచుకుంటే ఎవరైనా రాజు అవుతారు. అలాగే తరాజులు కూడా అవుతారు. ఇక ప్రభుత్వ ఉద్యోగులు ప్రతీ ఎన్నికకూ ఒకసారి తమ రాజకీయ విధానాలను మార్చుకుంటారు అని చెబుతారు. అలాగే జరుగుతోంది కూడా. ఉమ్మడి ఏపీలో చూస్తే అటు కాంగ్రెస్ ఇటు టీడీపీ మాత్రమే రాజకీయ ప్రత్యర్థులుగా ఉండేవి. ఈ రెండు పార్టీలను ఎంచుకుంటూ తడవకో పార్టీని ఉద్యోగులు అధికారంలోకి తెచ్చారు. అయితే 1994 నుంచి 2004 దాకా రెండు సార్లు టీడీపీ వస్తే 2004 నుంచి 2014 దాకా కాంగ్రెస్ రెండు సార్లు అధికారంలో ఉంది. ఇది ఒకింత మార్పుగా చూడాలి. విభజన ఏపీలో చూస్తే ఒకసారి టీడీపీ 2014 ఉద్యోగుల మద్దతుతో గెలిచింది అని చెబుతారు. 2019లో సీపీఎస్ రద్దు అన్న హామీతో వైసీపీని గెలిపించారు అని అంటారు. ఇక 2024లో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టడం వెనక ప్రభుత్వ ఉద్యోగుల పాత్ర గణనీయంగా ఉంది అని ప్రచారంలో ఉన్న మాట. ఇవన్నీ పక్కన పెడితే కూటమి పాలనకు ఏడాది కాలం అవుతోంది. ఇంకా నాలుగేళ్ళ పాటు సమయం ఉంది. ఇంతలోనే ప్రభుత్వ ఉద్యోగులలో మార్పు వచ్చిందా అన్న చర్చ సాగుతోంది. ఇలా ఎందుకు అంటే కొంతమంది మాజీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకులు తాజాగా వైసీపీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులలో కూటమి ప్రభుత్వం తీరు పట్ల మార్పు వచ్చిందని చెబుతున్నారు. అంటే వారిలో మెల్లగా అసంతృప్తి మొదలైందని, అది మరింతగా పెరుగుతుందని వారు అంటున్నారు. వారందరినీ వైసీపీ వైపుగా మళ్ళిస్తామని చెబుతున్నారు. ఇక వైసీపీకి అనుబంధంగా ఉన్న ఎంప్లాయిస్ పెన్షనర్స్ వింగ్ ను బలోపేతం చేసేందుకు మేమంతా కృషి చేస్తామని అంటున్నారు. అలాగే రాష్ట్రం కోసం ప్రజల కోసం జగన్ తీసుకుంటున్న ప్రతి నిర్ణయాన్ని ప్రజలు, ఉద్యోగుల దృష్టికి తీసుకువెళ్లేందుకు తాము కృషి చేస్తామని ఈ మాజీ ప్రభుత్వ ఉద్యోగులు చెబుతున్నారు. అంతే కాదు మళ్ళీ వైసీపీని అధికారంలోకి తెస్తామని వారు అంటున్నారు. ఇదిలా ఉంటే ప్రభుత్వ ఉద్యోగులలో ఇంతలోనే అంత మార్పు వచ్చిందా అన్న చర్చ సాగుతోంది. అయిదేళ్ళ వైసీపీ పాలనలో తాము నానా రకాలైన ఇబ్బందులు కడగండ్లూ పడ్డామని ఉద్యోగులు రిటైర్డ్ పెన్షనర్లు చెబుతూనే ఉన్నారు. ఈ ప్రభుత్వాన్ని వదిలించుకోవాలని వారు కంకణం కట్టుకుని మరీ పనిచేశారు. ఇక ప్రతీ నెలా జీతాలు కూడా అందని పరిస్థితి వైసీపీ ఏలుబడిలో ఉందని అప్పట్లో ఉద్యోగులు అంతా తీవ్రంగా వేదన చెందారు అని అంటారు. అంతే కాదు తనకు ఏ రకమైన ఆర్థిక ప్రయోజనాలు కానీ డీఏలు కానీ ఇతరత్రా కానీ దక్కలేదని అంటారు. ప్రత్యేకించి సీపీఎస్ రద్దు చేయలేదన్న తీవ్ర ఆగ్రహం వారిలో ఉ

# అమరావతి-విశ్వశ్రేణి కార్పొరేట్ రాజధాని!

అమరావతి,మే రెండవ తేదీన అమరావతి రాజధాని పనుల పున:ప్రారంభం పేర రూ.49 వేల కోట్ల విలువైన 74 పనులను మరోసారి ప్రధాని నరేంద్ర మోడీ ప్రారంభించిన విషయం తెలిసిందే. రాష్ట్ర ప్రభుత్వ ప్రచార ఆర్భాటంతో ఈసారైనా రాజధాని నిర్మాణానికి మోడీ నిధులు ప్రకటిస్తారని ప్రజలు భావించారు. కానీ మాటలతోటే సరిపెట్టారు. వాస్తవంగా ఆంధ్ర ప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం అమరావతి రాజధాని నిర్మాణానికి ముఖ్యంగా శాసనసభ, సచివాలయం, హైకోర్టు, వివిధ విభాగాల కార్యాలయాలు, మౌలిక సదుపాయాలు, గృహ కల్పన సదుపాయాలు మొదలగు వాటికి అవసరమైన నిధులు కేంద్రం ఇవ్వాలి. కానీ ఈ పదకొండేళ్ల కాలంలో రాజధాని నిర్మాణానికి కేంద్ర మోడీ ప్రభుత్వం కేవలం రూ.1500 కోట్లు మాత్రమే ఇచ్చింది. రాష్ట్రంలో టిడిపి, జనసేన, బిజెపి కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదు. కేవలం ప్రపంచబ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు, హడ్కో ద్వారా రూ. 31 వేల కోట్లు రుణం ఇప్పించి చేతులు దులుపుకుంది. ప్రధాని రాజధాని పనులు పున:ప్రారంభం ఎలా ఉన్నా అమరావతి రాజధాని నిర్మాణానికి కేంద్ర బిజెపి ప్రభుత్వం నిధులివ్వక పోవటాన్ని నయా ఉదారవాద విధానాల అమలులో భాగంగా మనం చూడాలి. ఈ విధానాలకు నమూనాగా అమరావతి రాజధాని నిర్మాణం రూపుదిద్దుకోబోతున్నదనేది అర్థం చేసుకోవాలి. ఇప్పటికే భారత దేశంలో అక్కడక్కడా ఈ విధానాల్లో భాగంగా కొన్ని చిన్న చిన్న నగరాలు నూతనంగా నిర్మాణం కాబడ్డాయి. లావాస, ధోలేరా, గిఫ్ట్ వంటివి ముఖ్యమైన చిన్న నగరాలు. ఆయా రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో కార్పొరేట్ పెట్టుబడితో నిర్మించబడ్డ ప్రైవేట్ నగరాలివి. ప్రభుత్వం కేవలం కొన్ని నామమాత్ర పరిపాలనా కార్యక్రమాల్లో మాత్రమే వీటిలో భాగం పంచుకుంటుంది. ఇక పెద్ద పెద్ద గేటెడ్ కమ్యూనిటీలను పెద్ద పెద్ద నగరాల్లో మనం చూస్తున్నాం. ఇటీవల కేంద్ర ప్రభుత్వం పారిశ్రామిక కేంద్రాలు, కారిడార్లకు అనుసంధానంగా సమీకృత టౌన్‌షిప్‌ల నిర్మాణానికి కూడా ప్రయత్నం చేస్తున్నది. ఇవన్నీ ప్రైవేట్ పెట్టుబడితో నిర్మాణం జరుగుచున్నవే. భూమి దగ్గర నుండి అన్ని రకాల సదుపాయాలను ప్రభుత్వం బాధ్యతగా వీటికి కల్పిస్తుంది. పరిపాలనా వ్యవస్థ మొత్తం ప్రైవేట్ వారి ఆధీనంలోనే ఉంటుంది. భారత దేశంలో గత రెండు దశాబ్దాల నుండి పట్టణ సంస్కరణల పేర ఇప్పటికే ఉన్న అన్ని పౌర సేవలు, మౌలిక సదుపాయాలలోకి ప్రైవేట్ పెట్టుబడులను అనుమతించే విధానాల అమలుకు ప్రయత్నం చేస్తున్నారు. అయితే దేశంలో ఇప్పటివరకు ఎక్కడా ఒక రాష్ట్ర నూతన రాజధాని నిర్మాణం పూర్తిగా నయా ఉదారవాద విధానాల మార్గదర్శకత్వంలో జరగలేదు. ఇప్పుడు అమరావతి రాజధానే దేశంలో తొలి కార్పొరేట్ రాజధాని కాబోతున్నది. అమరావతి రాజధాని నిర్మాణానికి అవసరమైన భూమి సేకరణ పద్ధతే ఈ విధానం ప్రారంభానికి తొలి పక్రియగా పేర్కొనవచ్చు. దీనికి ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ (ఎ.పి సి.ఆర్.డి.ఎ), అమరావతి కార్పొరేషన్ సంస్థ (ఎ.డి.సి)లను ఏర్పాటు చేశారు. మొత్తం ల్యాండ్ పూలింగ్ ద్వారా 34,390 ఎకరాలను సుమారు 28,740 మంది రైతుల నుండి సేకరించిన విషయం తెలిసిందే. ఇదికాక చుట్టూ ఉన్న ప్రభుత్వ భూమితో కలిపి మొత్తం 53 వేల ఎకరాల భూమిని మొదటి దశలో సమీకరించారు. ఇప్పుడు అంతర్జాతీయ విమానాశ్రయం, అంతర్జాతీయ క్రీడా మైదానాలు ఇలా మరికొన్ని ప్రాజక్టుల పేర రెండో దశలో మరో 44 వేల ఎకరాల భూసేకరణకు ప్రభుత్వం సిద్ధమవుతున్నట్లు ప్రకటించారు. రాజధాని నిర్మాణంలో భూసేకరణకు అంతం ఉండదు. ప్రైవేట్ పెట్టుబడుల ప్రయోజనాల కోసం నిరంతరం విస్తరించుకుంటూ పోతారు. రాజధాని నిర్మాణంలో భూమి మొత్తం ఒక వ్యాపార సరుకుగా మార్చబడుతుంది. దీనికి అనుగుణంగానే రాజధాని 12 జోన్లుగా విభజించబడింది. పరిపాలన, నివాస, న్యాయ, వ్యాపార, ఎలక్ట్రానిక్స్, నాలెడ్జ్, ఆరోగ్య, క్రీడా, పర్యాటక ఇలా నవనగరాల పేర్లతో భూమి ప్రైవేట్ పెట్టుబడులకు కేటాయించబడుతున్నది. ప్రభుత్వం ప్రస్తుతం ప్రకటించిన రాజధాని పరిధి 217 చ.కి మీటర్లలో ముఖ్యమైన సీడ్ క్యాపిటల్ కేవలం 17 చ.కి మీటర్లు మాత్రమే. రెండో దశలో సేకరించాలనుకుంటున్న భూమిని కూడా పరిగణనలోకి తీసుకుంటే రాజధాని పరిధి రెట్టింపు అవుతుంది. దీనిని బట్టి రాజధాని భూమి ఏ స్థాయిలో మార్కెట్ సరుకుగా మారిందో అర్థం చేసుకోవచ్చు. దీనికి తోడు సి.ఆర్.డి.ఎ పరిధిని ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాలలో సుమారు 8,352



చ.కి మీటర్లకు విస్తరించారు. కనుక అమరావతి పూర్తిగా మార్కెట్ ఆర్థిక నమూనాతో నిర్మాణం అవుతున్న కార్పొరేట్ రాజధాని. ఆర్థిక వృద్ధిని పెంచాలనే నయా ఉదారవాద దృక్పథం నుండి ఇది రూపుదిద్దుకొంటున్నది. అందువల్ల రాజధాని నిర్మాణానికి%శి% కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ల నుండి నిధులు కేటాయించే దానికన్నా అంతర్జాతీయ ఫైనాన్స్ సంస్థల నుండి రుణ రూపంలో నిధులు సేకరించాలనేదే వ్యూహంగా వున్నది. దాంతో రాష్ట్ర విభజన చట్టం హామీలో పేర్కొన్న రాష్ట్ర రాజధాని నిర్మాణ వ్యయ బాధ్యత నుండి కేంద్రం తప్పుకున్నది. నిర్మాణ ప్రారంభమైన తొలి దశ (2018) లోనే అప్పటి ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు నాయుడు అమరావతి బాండ్స్ పేర రూ.2 వేల కోట్లు 10.32 శాతం వడ్డీతో సమీకరించిన విషయం తెలిసిందే. ఇలా అనేక రూపాల్లో ఈ అప్పుల సేకరణ కొనసాగుతుంది. అలాగే భూముల అమ్మకం ద్వారా పెద్ద ఎత్తున నిధులు సేకరించి నిర్మాణానికి వినియోగించడం మరో ముఖ్యమైనది. అయితే తీసుకొచ్చే రుణాలు తీర్చడం మాత్రం రాష్ట్ర ఖజానా బాధ్యతగా ఉంటుంది. అంటే ప్రజలు దీనికి మూల్యం చెల్లించాల్సి ఉంటుంది. ఇప్పుడు అమరావతి రాజధాని భూ కేటాయింపులు మొత్తం ప్రైవేట్ పెట్టుబడుల చుట్టూ వారి ప్రయోజనాలకు అనుగుణంగా కేటాయింపులు జరుగుచున్నాయి. వీటికి అనేక కొత్తకొత్త పేర్లు, సిటీలు సృష్టిస్తున్నారు. కోట్ల రూపాయల భూ రాయితీలు ఇస్తున్నారు. భూ చట్టాలను సరళతరం చేస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో అమలు జరుగుతున్న పట్టణ ప్రణాళికకు నేడు రాజధాని ప్రాంతంలో అమలు చేస్తున్న దానికి ఏమాత్రం సంబంధం లేదు. దీనిని పూర్తిగా ప్రైవేటు పెట్టుబడుల ఆర్థిక ప్రయోజనాలు, రియల్ ఎస్టేట్ కార్యకలాపాల విస్తరణ కేంద్రంగా అమలు చేస్తున్నారు. నగర జోనింగ్ నిబంధనలను రాజధాని నిర్మాణ విషయంలో మార్చేశారు. ఈ జోనింగ్ విధానం వ్యాపార వాణిజ్య పారిశ్రామిక కార్యకలాపాలను నియంత్రించదు. వీటి విచ్చలవిడి అరాచక చర్యలలో జోక్యం చేసుకోకుండా అచేతనంగా ఉంటుంది. అంతేకాకుండా పౌరుల జీవన కోణం, పర్యావరణం వంటి వాటికి ఈ జోనింగ్ వ్యవస్థలో ప్రాధాన్యత లేదు. కేవలం పెట్టుబడి ప్రయోజనాలతో పాటు ధనిక, ఉన్నత మధ్య తరగతి, వారి అవసరాలు, ప్రయోజనాల చుట్టూ పట్టణ ప్రణాళిక, జోనింగ్ విధానం మారింది. ప్రతి ప్రాజెక్టును ఈ విధానంతోనే రూపొందిస్తున్నారు. అమలులోకి తీసుకొస్తున్నారు. ప్రభుత్వ పాత్ర, దాని స్వభావం కూడా పూర్తిగా మారిపోతున్నది. మార్కెట్ సూత్రాలను అమలులోకి తీసుకు రావడం, వాటిని ప్రోత్సహించడం, ప్రైవేట్ పెట్టుబడులను ఆకర్షించేందుకు, వాటితో పెనవేసుకొని అక్రమ బంధం కొనసాగించేందుకు చాలా చురుగ్గా పనిచేస్తున్నది. ఒక్క మాటలో చెప్పాలంటే ప్రైవేట్ పెట్టుబడికి పూర్తిగా రక్షకుడిగా మారిపోతున్నది. అమరావతి నమూనాలోనూ, ప్రభుత్వ పాత్రలోనూ ప్రజల జీవనోపాధి, సామాన్యుల గృహ వసతి, సామాజిక అభివృద్ధి, సమ న్యాయం, ఆర్థిక అసమానతల నిర్మూలన వంటి వాటికి ప్రాధాన్యత లేదు. అటువంటి వాటికి అక్కడ స్థానమే ఉండదు. పేదవాడికి నివాస హక్కు ఉండదు సరికదా పౌరుల హక్కులు నిర్వీర్యం చేయడానికి ప్రభుత్వం శత్రుపూరిత వైఖరి తీసుకొని తలపడుతుంది. ప్రైవేట్ పెట్టుబడులకు శ్రామిక వర్గాల నుండి ఎలాంటి ఆటంకాలు ఎదురైనా సహించదు. అలాంటివి రాకుండా అన్ని రకాల ముందస్తు చర్యలు చేపడుతూ, అడుగడుగునా నిఘా వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నది. వినియోగ ఆధారిత అభివృద్ధిగా సంపన్నులకు, ఉన్నతి మధ్యతరగతి వర్గాలకు అత్యంత విలాసవంతమైన ఆకాశహర్మ్యాలు నిర్మించబడుతున్నాయి.

# పూర్తిస్థాయి యుద్ధం వస్తే భారత్‌దే విజయం

న్యూఢిల్లీ,పాక్‌తో యుద్ధంలో భారత్‌దే విజయం అంటూ అమెరికా ఎయిర్‌ఫోర్స్‌కు చెందిన ఓ మాజీ పైలట్ నెట్టింట పెట్టిన పోస్టు ప్రస్తుతం వైరల్ అవుతోంది. డేల్ స్టార్క్ అనే మాజీ పైలట్ గురువారం ఈ పోస్టు నెట్టింట పంచుకున్నారు. భారత్ గెలుపుపై తన మొత్తం డబ్బును పందెం కాసేందుకు సిద్ధమేనని అన్నారు. పహల్గాం దాడికి ప్రతీకారం తీర్చుకునేందుకు ఆపరేషన్ సిందూర్ ప్రారంభించిన భారత్ పాక్‌లోని ఉగ్రస్థావరాలను కచ్చితమైన మిసైల్ దాడులతో ధ్వంసం చేసింది. అయినా బుద్ధి తెచ్చుకోని పాక్ ప్రస్తుతం సరిహద్దు వెంబడి కవ్వింపు చర్యలకు దిగుతోంది. ఈ నేపథ్యంలో పరిస్థితులు ముదిరితే ఎలా అన్న చర్చ మొదలైంది. ఈ విషయంపై డేల్ స్టార్క్ తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. భారత్, పాక్ పైలట్లు- ఇద్దరితోనూ నేను గతంలో కలిసి పనిచేశా. ఈ పరిస్థితి ముదిరితే మాత్రం భారత్‌కే విజయం దక్కుతుందని నా అభిప్రాయం అని పేర్కొన్నారు. డేల్ కామెంట్స్‌కు పలు కారణాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. పాక్ వద్ద అమెరికాకు చెందిన ఎఫ్-16, చైనాకు చెందిన జేఎఫ్-17 విమానాలు ఉంటే భారత్ వద్ద ఫ్రాన్స్‌కు చెందిన అత్యాధునిక రఫేల్ విమానాలు ఉన్నాయి. 4.5 తరం యుద్ధ విమానమైన రఫేల్.. భారత యుద్ధ విమానాల్లో అత్యాధునికమైనది. భారత ఉపఖండ పరిస్థితుల కోసం 13 ప్రత్యేక ఫీచర్లను కూడా రఫేల్‌కు జోడించారు. బియాండ్ విజువల్ రేంజ్ లక్ష్యాలను ధ్వంసం చేసే మెటియార్ మిసైల్స్, ఎల్క్ట్రానిక్ యుద్ధరీతులకు ఉద్దేశించిన సాధనాలు, గొప్ప సామర్థం కలిగిన రాడార్, కమ్యూనికేషన్ వ్యవస్థలు ఈ విమానంలో ఉన్నాయి. ఫలితంగా యుద్ధ సమయాల్లో అత్యంత సమర్థవంతంగా ఈ విమానాలు తమ లక్ష్యాలను ధ్వంసం చేయగలవు. ఇక హామర్ బాంబ్స్, స్కాల్ప్ మిసైల్స్‌తో రఫేల్ యుద్ధ విమానాలు శత్రుదేశ మూలమూలాల ఉన్న లక్ష్యాలను ధ్వంసం చేయగలవు. ఇక పాక్‌కు ఎఫ్-16లు విక్రయించేటప్పుడే అమెరికా ఎన్నో ఆంక్షలు విధించింది. భారత్‌పై ఈ విమానాలను వాడొద్దని స్పష్టం చేసింది. ఎఫ్-16ల వినియోగంపై వేయి కళ్లతో నిఘా పెట్టింది. ఆర్థిక కష్టాల్లో ఉన్న పాక్‌కు ఎఫ్-16ల నిర్వహణ కష్టంగా మారింది. దీంతో, ఎఫ్-16 అన్ని అవసరాలకు వినియోగించుకోలేని పరిస్థితుల్లో పాక్ ఇరుక్కుపోయింది. జేఎఫ్ -17 యుద్ధ విమానాలు ఉన్నప్పటికీ వీటి సామర్థం రఫేల్‌తో పోలిస్తే పరిమితమేనని రక్షణ రంగ నిపుణులు చెబుతున్నారు. ఆయుధాలు మోసుకెళ్లే సామర్థం, యుద్ధ సమయాల్లో శత్రువుల దాడుల నుంచి తప్పించుకోవడం, సుదూరాన లక్ష్యాలను ధ్వంసం చేసే సామర్థంలో జేఎఫ్-17 రఫేల్‌తో పోలిస్తే వెనకబడే ఉంటోంది.

## బలూచీలో ఊపందుకున్న స్వాంత్ర్య పోరాటం

లాహోర్, పాకిస్తాన్ లోని బలూచిస్థాన్ ప్రావిన్స్‌లో స్వాతంత్ర్య పోరాటం మరోసారి తెరపైకి వచ్చింది. బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ ఇందుకు తన కార్యకలాపాలను ముమ్మరం చేస్తున్నట్లు- తెలుస్తోంది. దీంతో పాకిస్తాన్ ప్రభుత్వానికి మరో కొత్త సవాళు ఎదురయ్యే అవకాశం ఎక్కువగా కనిపిస్తుంది. భారత్ - పాకిస్తాన్ మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొన్న పరిస్థితిలో ప్రస్తుత పరిస్థితులను బీఎల్‌ఏ తమకు అనుకూలంగా మార్చుకుంటూ తమకు ప్రత్యేక దేశం కావాలని డిమాండ్‌ను బలంగా వినిపిస్తోంది. బలూచిస్థాన్‌లోని పలు ప్రాంతాల్లో స్థానిక ప్రజలు పాకిస్తాన్ జెండాను తొలగించి, వాటి స్థానంలో బలూచిస్థాన్ జెండాలను ఎగురవేస్తున్నారు. అంతేకాకుండా పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేస్తున్నారు. ఇందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. కాగా, బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ ఇదివరకే తమకు ప్రత్యేక దేశం కావాలని పాకిస్థాన్ సైనికులపై దాడులు చేసింది. ఒక పక్క భారత ప్రతీకారుల దాడులతో ఒణికిపోతున్న పాకిస్తాన్‌కు బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ తమ ఆందోళనతో పాక్‌ను మరింత ఉక్కిరిబిక్కిరి చేసేలా కనిపిస్తుంది.

## యుద్ధభూమిలో కన్నుమూసిన తెలుగువీరుడు

న్యూఢిల్లీ/అమరావతి, భారత్, పాకిస్తాన్‌ల మధ్య జరుగుతున్న యుద్ధంలో ఓ తెలుగు జవాన్ వీర మరణం పొందాడు. శ్రీ సత్య సాయి జిల్లా గోరంట్ల మండలం, కల్లితాండ పంచాయతీకి చెందిన మురళీ నాయక్ యుద్ధ భూమిలో కన్నుమూశాడు. మురళీ నాయక్ మరణంతో స్వగ్రామంలో విషాదం నెలకొంది. తల్లిదండ్రులు శ్రీరాం నాయక్, జ్యోతీ బాయిలు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. ఈ వీర జవాన్ ఈ దంపతుల ఏ-కై-క సంతానం కావటం గమనార్హం. వీర జవాన్ మురళీ నాయక్ మరణంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పందించారు. ఈ మేరకు శుక్రవారం తన ట్విటర్ ఖాతాలో ఓ పోస్టు పెట్టారు. ఆ పోస్టులో.. ' దేశ రక్షణలో శ్రీ సత్యసాయి జిల్లా, పెనుకొండ శాసన సభ నియోజకవర్గం, గోరంట్ల మండలానికి చెందిన మురళీ నాయక్ అనే సైనికుడు ప్రాణాలు కోల్పోవడం విషాదకరం. దేశం కోసం ప్రాణాలర్పించిన అమరవీరుడు మురళీ నాయక్‌కు నివాళులు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానని పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా జమ్మూ కాశ్మీర్ యుద్ధ భూమిలో పోరాడుతూ.. రాష్ట్రానికి చెందిన మురళీ నాయక్ వీరమరణం పొందడం తనను తీవ్ర ఆవేదనకు గురిచేసిందని రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. మురళీ నాయక్ చూపిన ధైర్య,సాహసాలు రాష్ట్రానికే గర్వకారణమని పేర్కొన్నారు. మురళీ నాయక్ పార్థివ దేహానికి రాష్ట్ర ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు జరిపిస్తామని తెలిపారు. ఆయన కుటుంబానికి అన్నివిధాలా అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. మురళి నాయక్ మృతి చెందడంతో వీర జవానుకు పలువురు నేతలు నివాళులర్పించారు. ఎపి డిప్యూటి సిఎం శుక్రవారం పోస్టు పెడుతూ ...ఆపరేషన్ సిందూర్ లో భాగంగా జమ్మూ కాశ్మీర్ యుద్ధభూమిలో పోరాడుతూ మన రాష్ట్రానికి చెందిన మురళి నాయక్ వీరమరణం పొందడం నన్ను తీవ్ర ఆవేదనకు గురిచేసింది. మురళి నాయక్ చూపిన ధైర్య, సాహసాలు రాష్ట్రానికే గర్వకారణం. మురళీ నాయక్ పార్థివ దేహానికి రాష్టప్రభుత్వ అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు జరిపిస్తాం. ఆయన కుటుంబానికి అన్నివిధాలా అండగా నిలుస్తామని పేర్కొన్నారు.

## పాక్‌తో ఉద్రిక్తతల వేళ నటి రష్మిక పోస్ట్

హైదరాబాద్,శాంతిని కోరుకోవడమంటే.. హానిని అంగీకరించడం కాదని రష్మిక అన్నారు. భారత్- పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతలు మరింత తీవ్రమైన నేపథ్యంలో ఆమె పోస్ట్ వైరల్‌గా మారింది. అన్యాయానికి బదులు తీర్చుకునే దేశాన్ని ప్రశ్నించవద్దంటూ తన ఇన్‌స్టా స్టోరీలో రాసుకొచ్చారు. ఉగ్రవాదం నుంచి మనల్ని రక్షించుకునేందుకు చేసే పోరాటం యుద్ధం కాదు. ఈ పోరాటానికి మద్దతిచ్చే వారిని యుద్ధాన్ని కాంక్షించే వారిగా పేర్కొనొద్దు. దేశ భద్రత, న్యాయం కోసం ఆరాటపడే పౌరులు వారు. దూకుడు ధోరణి, అత్యవసర ఆత్మరక్షణకు మధ్య చాలా నైతిక భేదం ఉంటుంది. కుట్రపూరితంగా జరిగిన ఉగ్రవాద చర్యలో అమాయకులు ప్రాణాలు కోల్పోయినప్పుడు.. దానికి ప్రతీకారం తీర్చుకోవడం అనేది బాధ్యతే అవుతుంది తప్ప.. అవకాశం కాదు. శాంతిని కోరుకోవడమంటే అర్థం.. జరిగిన హానిని మౌనంగా అంగీకరించడం కాదు. మనకు జరిగిన అన్యాయానికి బదులు తీర్చుకుంటు-న్న దేశాన్ని ప్రశ్నించొద్దు. సీమాంతర ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న వారిని ప్రశ్నించండని తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. ఎప్పుడూ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే రష్మిక..

# ఎవరికి ఏ పదవి? తేల్చేసిన హైకమాండ్




హైదరాబాద్,కాంగ్రెస్ పార్టీలో పదవుల పంచాయితీ తేలడం లేదు. కనీసం పీసీసీ కార్యవర్గం ఏర్పాటు కూడా ఇప్పటి వరకు పూర్తి కాలేదు. గత కొంత కాలంగా కార్యవర్గ రూపకల్పన జరుగుతున్నట్లు ప్రచారం చేస్తున్నారులిస్టు ఢిల్లీకి వెళ్లిందని చెప్పుకొస్తున్నారు. పలుమార్లు సీఎం, పీసీసీ చీఫ్? లు కూడా ఢిల్లీకి వెళ్లి కార్యవర్గం ఏర్పాటుపై తమ వివరణ ఇచ్చారు. కానీ కార్యవర్గం ప్రకటన లో జాప్యం జరుగుతూనే ఉంది. దీంతో పదవులు ఆశిస్తున్న పార్టీ నేతల్లో స్థబ్దత నెలకుంటోంది. మరి పీసీసీ ప్రెసిడెంట్ చెపుతున్నట్లు ఈ నెలలో అయినా పీసీసీ కార్యవర్గాన్ని ప్రకటిస్తారా?

ఇంకా ఏర్పాటు కాని టీ పీసీసీ కార్యవర్గం

తెలంగాణ కొత్త పీసీసీ అధ్యక్షుడిగా మహేష్‌కుమార్‌గౌడ్ బాధ్యతలు చేపట్టి దాదాపు 9 నెలలు కావొస్తుంది. అయినా పీసీసీకి పూర్తిస్థాయి కార్యవర్గాన్ని ఇప్పటి వరకు ఏర్పాటు చేయకపోవడం విస్మయానికి గురి చేస్తుందంటున్నారు. హైకమాండ్ ఆదేశాల మేరకు పీసీసీ టీమ్‌లోకి గతంలోనే కొన్ని పేర్లను ఎంపిక చేశారు. జిల్లాల వారీగా ఫీడ్ బ్యాక్ తీసుకొని మరీ హైకమాండ్ కు పంపించారు. కానీ ఎలాంటి ఫలితం లేదని ఆశావహులు అంసతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వాయిదాలు వేస్తున్నారే తప్పకొత్త కమిటీల ప్రకటన ఊసే లేకపోవడంతో గాంధీభవన్ కు వస్తున్న నేతలు నిరాశకు గురవుతున్నారట.

ప్రభుత్వానికి, పార్టీకి మధ్య కొరవడిన కో ఆర్డినేషన్

ప్రస్తుతం పాత కార్యవర్గంతోనే పీసీసీ కార్యక్రమాలు చేయాల్సి వస్తోంది. పైగా టీమ్ కూడా పూర్తి స్థాయిలో లేదు. చాలా మంది వేర్వేరు పార్టీ పోస్టులలో బాధ్యతలు నిర్వహిస్తున్న పరిస్థితి. దీంతో పార్టీ చేపట్టిన కార్యక్రమాలేవీ పూర్తి స్థాయిలో ప్రజల్లోకి వెళ్లలేకపోతున్నారనే టాక్ నడుస్తోంది. ప్రభుత్వానికి, పార్టీకి మధ్య కో ఆర్డినేషన్ లేకపోవడానికి ఇదే కారణమంటున్నారు. ఆ క్రమంలో ప్రభుత్వంపై నెగెటివ్ టాక్ పెరుగుతుందనే చర్చ మొదలైంది. పీసీసీ కార్యవర్గం ప్రకటన ఇంత ఆలస్యంగా ఎప్పుడూ జరగలేదని సీనియర్ నాయకులు అంటున్నారు. పార్టీ కోసం ఎంత పనిచేసినా, పదవులు లేకపోవడంతో తమకు గుర్తింపు లేదని నేతలు మధనపడుతున్నారు. క్యాబినెట్ విస్తరణ అటు ఉంచితే%శా%పీసీసీ కార్యవర్గాన్ని కూడా పెండింగ్ పెట్టడంతో నాయకులు తీవ్ర అసంతృప్తితో కనిపిస్తున్నారు.

రేసులో దాదాపు 200 మంది నేతలు

కొత్త పీసీసీ కార్యవర్గంలో స్థానం కోసం స్టేట్ ఆఫీస్ గాంధీ భవన్ నుంచి జిల్లా స్థాయి లో కమిటీ ల వరకు ఫుల్ కాంపిటేషన్ నెలకొంది. దాదాపు రెండు వందల మంది నేతలు పార్టీ పదవుల కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే నేతల మధ్య అభిప్రాయ భేదాలు, సమన్వయ లోపం లేకుండా కొత్త పీసీసీ కమిటీ ప్రకటిస్తామని ముఖ్య లీడర్లు చెబుతున్నారు. ఇక గతంలో పీసీసీ కార్యవర్గంలో జంబో ప్యాక్ ఉండేది. సుమారు 90 మంది సభ్యులు ఉండే కానీ ఈ సారి ఆలా కాకుండా లిమిటెడ్‌గా జిల్లాకి ఇద్దరి చొప్పున పార్టీ కోసం సిన్సియర్ గా పని చేసే వారికి అవకాశం కల్పించనున్నట్లు గాంధీభవన్ వర్గంలో చర్చ నడుస్తుంది. అలాగే పీసీసీ సెక్రటరీ లు, స్పోక్స్ పర్సన్స్ విషయం లో కూడా అచి తూచి లిస్ట్ తయారౌతున్నట్లు సమాచారం.

# ఇంకా కశ్మీర్ కోసమే కక్కుర్తా? పాక్ బుద్ధి మారదా?

జమ్ము కశ్మీర్: కశ్మీర్.. కశ్మీర్.. కశ్మీర్. దశాబ్దాలుగా జమ్మూ కశ్మీర్ కోసమే పాకిస్తాన్ కక్కుర్తి పడుతోంది. ఆ హిమాలయా రాష్ట్రం భారత్‌లో విలీనం అవడాన్ని తట్టుకోలేక పోతోంది. పీవోకేను అక్రమంగా ఆక్రమించుకున్నాక కూడా సంతృప్తి పడట్లేదు. ఉగ్రవాదులతో మారణహోమం సృష్టిస్తూ.. రావణకాష్టాన్ని రాగిలిస్తూనే ఉంది. కార్గిల్ వార్ తరహా ఘటనలతో చేతులు కాల్చుకున్నాక కూడా బుద్ధి మారట్లేదు. ఇప్పుడు పహల్గాం ఉగ్రదాడితో మరోసారి కశ్మీర్‌ను డిస్ట్రర్బ్ చేయాలని చూసింది. ఈసారి చేతులే కాదు.. పాక్ ఒళ్లంతా తగలబెట్టేసింది ఇండియా. ఆపరేషన్ సిందూర్‌తో దాయాది ఇంటికెళ్లి మరీ చంపేసి వచ్చింది. డ్రోన్లు, మిస్సైల్స్‌తో పాకిస్తాన్‌లోని 9 నగరాల్లో అగ్గి పెట్టింది. పాక్‌లో లంకా దహనం జరుగుతూనే ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో కూడా మళ్లీ కశ్మీర్‌పైనే కన్నుపడింది పాపిస్తాన్‌కు.

కశ్మీరే టార్గెట్

జమ్మూ కశ్మీర్‌ను పాక్‌లో విలీనం చేయడమే ఉగ్రసంస్థల ప్రధాన లక్ష్యం. దీని కోసమే అటు పాక్, ఇటు ఉగ్రవాదులు దాడులకు తెగబడుతున్నాయి. ఆపరేషన్ సిందూర్‌కు రివేంజ్‌గా గురువారం రాత్రి భారత్‌లోని 15 నగరాలపై దాడులకు ప్రయత్నించింది పాక్. ఈ దాడిలోనూ కశ్మీర్‌నే ఎక్కువ టార్గెట్ చేసింది. డ్రోన్లు, మిస్సైల్స్‌లో ఎక్కువ భాగం జమ్మూపైనే ఎక్కుపెట్టింది. ఇండియన్ ఆర్మీ దీటుగా ఎదుర్కొంది కాబట్టి సరిపోయింది. లేదంటే, ఈపాటికి కశ్మీర్ పరిస్థితి ఎలా ఉండేదో.

తమకు దక్కలేదనే కోపమా?

జమ్మూతో పాటు 300 కిలోమీటర్ల దూరంలోని కుప్వారా, పఠాన్‌కోట్, గురుదాస్‌పూర్ పై పాక్ అటాక్ చేసింది. జమ్మూ ఎయిర్‌పోర్టుపై దాడులకు ట్రై చేసింది. సరిహద్దు వెంబడి పాక్ సైన్యం విచ్చలవిడిగా కాల్పులు జరుపుతోంది. ఇన్నేళ్లూ ఏ కశ్మీర్ కావాలని అంతటి మారణహోమానికి పాల్పడిందో.. ఇప్పుడు అదే ప్రాంతాన్ని బాంబులతో బుగ్గి చేయాలని చూసింది పాక్. తమకు దక్కనిది మరెవరికీ దక్కకూడదనే కాన్సెప్ట్ కావొచ్చు. గురువారం రాత్రి పాక్ దాడి సక్సెస్ అయి ఉంటే ఏం జరిగేది? కశ్మీర్ ప్రజలు కాలి బూడిదయ్యేవారు. జమ్మూ, శ్రీనగర్ శవాల దిబ్బగా మారేది. కానీ, మన ఆర్మీ ముందు పాక్ ఆటలు సాగలేదు.

కశ్మీర్ ప్రజలు మారేనా?

గురువారం రాత్రి కొన్ని గంటల పాటు యుద్ధ బీభత్సం కొనసాగింది. శుక్రవారం ఉదయం జమ్మూ కశ్మీర్‌లో ప్రశాంతంగా తెల్లవారింది. అక్కడి పౌరులకు పాక్ దాడి చేస్తుందేమోననే భయం ఇప్పుడు తొలగిపోయింది. ఇండియన్ ఆర్మీ




తమకు అడ్డుగోడల నిలబడి కాపాడుతుందనే ధైర్యం నెలకొంది. ఇది కదా కావాల్సింది. మరి, తమను చంపాలని చూసిన పాకిస్తాన్‌పై కశ్మీర్ ప్రజల్లో కోపం, ద్వేషం పెరుగుతుందా? ఇన్నాళ్లూ భారత్ వ్యతిరేక భావజాలంతో ఉన్న కొన్ని వర్గాలు ఇప్పటికైనా కళ్లు తెరుస్తాయా? పాక్‌కు కావలసింది అక్కడి ప్రజలు కాదని.. కేవలం ఆ భూభాగం మాత్రమేననే లాజిక్ ఇప్పటికైనా గ్రహిస్తారా? పాక్ కసాయిలా తమను చంపాలని చూస్తే.. ఇండియా కన్న తల్లిలా తన బిడ్డలను కాపాడుకున్న తీరు అక్కడివారి కళ్లు తెరిపిస్తుందా? ఇప్పటికైనా పాక్ మత్తును వదులుతారా?

నివురు గప్పిన నిప్పులా..

ప్రస్తుతం అక్కడ పరిస్థితి కాస్తా ప్రశాంతగానే కనిపిస్తోంది. భద్రతా బలగాలు భారీగా మోహరించారు. అప్రమత్తత కొనసాగుతోంది. ప్రజలు తమ ఇళ్లలో నుంచి బయటికి రాకూడదని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. విద్యాసంస్థలకు, ప్రభుత్వ కార్యాలయాలకు తాత్కలికంగా సెలవులు ప్రకటించారు. పలు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. స్థానికులు అపోహలకు లోను కావొద్దని సైన్యం ప్రకటించింది. ఎలాంటి సమాచారమైన ఆర్మీ నుంచి వస్తేనే నమ్మాలని విజ్ఞప్తి చేసింది.

ఉగ్ర చొరబాట్లకు చెక్

మరోవైపు, సరిహద్దుల్లో పాక్ కుట్రలు ఇంకా కొనసాగుతున్నాయి. ఉగ్ర మూకల్ని కశ్మీర్‌లోకి పంపించేందుకు అనువుగా బోర్డర్‌లో కాల్పులకు తెగబడుతోంది. గురువారం రాత్రి బోర్డర్ దాటడానికి వీలుగా సాంబా సెక్టర్‌లోని ధన్‌ధర్ పోస్ట్ దగ్గర పాక్ ఆర్మీ కాల్పులు జరిపింది. భారత సైన్యం దృష్టి మళ్లించి ఉగ్రవాదులను పంపేందుకు ప్లాన్ చేసింది. పాక్ కుట్రను పసిగట్టిన %దీూఖీ%.. సరిహద్దు దాటడానికి ప్రయత్నించిన.. ఏడుగురు జైషే ఉగ్రవాదులను కాల్చి చంపింది.

# మరింత కాక రేపుతున్న ఏపీ రాజకీయాలు..!

అమరావతి,ఏపీ రాజకీయాలు పరిశీలిస్తున్నవారు.. వీటిని చూసి ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికార కూటమి పార్టీ లకు, ప్రతిపక్ష వైసీపీకి మధ్య పెరుగుతున్న గ్యాప్.. ఆందోళన కరంగా ఉందని చెబుతున్నారు. ఇది ఎవరి కీ మంచిది కాదని కూడా చెబుతున్నారు. ముఖ్యంగా రాష్ట్రానికి భవిష్యత్తును లేకుండా చేసినా ఆశ్చర్యం లేదని అంటున్నారు. పార్టీల మధ్య స్పర్థలు కామనే అయినా.. అవి కక్ష పూరిత రాజకీయాలకు దారి తీస్తే.. మున్ముందు ప్రమాదకర సంకేతాలు పెంచుతాయని అంటున్నాయి.తాజాగా వైసీపీ అధినేత జగన్ .. మున్ముందు పరిస్థితిని ఆవిష్కరించారు. ఆయన పోలీసులను, అధికారులనే కాకుండా.. టీడీపీ నాయకులను కూడా టార్గెట్ చేసుకుని కామెంట్లు చేశారు. ఎక్కడున్నా వదిలి పెట్టేది లేదన్నారు. రాజకీయాలకు దూరంగా ఉన్నామని చెప్పినా.. కాళ్లా వేళ్లా పడినా కూడా కనికరించేది లేదని హెచ్చరించారు. ఆయన వ్యాఖ్యలు ఎవరిని ఉద్దేశించినవో అందరికీ తెలిసిందే. ఈ ప్రభావం రాష్ట్ర భవిష్యత్తుపై పడుతుందని పరిశీలకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.రాజకీయాల్లో సహజంగానే ఏ రాష్ట్రంలో అయినా.. రెండు వర్గాలు ఉంటాయని.. కానీ, కక్షపూరిత చర్యలకు దిగే విధంగా వ్యవహరిస్తే.. అది మంచిది కాదని చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం కూడా సంయమనం పాటించాలని.. అవకాశం వచ్చిందన్నట్టుగా వ్యవహరిస్తే.. అది మున్ముందు పార్టీకి ప్రయోజనకరంగా ఉండబోదని చెబుతున్నారు. ప్రస్తుతం వైసీపీ నాయకులను అడ్డుకుంటున్న తీరు కూటమి పార్టీలను హ్యాపీ చేస్తున్నాయి. రోజు కో కేసుతో కూటమి ప్రభుత్వం వైసీపీని ముప్పుతిప్పలు పెడుతోంది.దీనికి అలవాటు పడిన



నాయకులు సరే.. కానీ.. కొత్త నాయకులు మాత్రం బెంబేలెత్తుతున్నారు. రాజకీయాలకు కూడా దూరమవుతున్నారు. ఇది సహజంగానే వైసీపీని ఇరకాటంలో పడేసి.. పార్టీ కార్యక్రమాలకు కూడా విఘాతం కలిగిస్తోంది. కూటమి కోరుకునేది కూడా ఇదే. కానీ.. ప్రజాతీర్పు ఎలా ఉంటుందో ఎవరూ ఊహించడం కష్టం. ఒంటరిగానే ఉన్నా.. కూటమిగానే ఉన్నా.. ఓడిన గెలిచిన పార్టీలు అనేకం ఉన్నాయి. భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుంటే.. ఇప్పుడున్న దూకుడు పెంచడం సరికాదన్న సూచనలు దాదాపు అన్ని వర్గాల నుంచి వినిపిస్తుండడం గమనార్హం. ఇది రాష్ట్ర రాజకీయాలను భవిష్యత్తులో శాసించే పరిస్థితి వస్తుందని చెబుతున్నారు.

# వరల్డ్ వ్యూహం... భారత్ కు వ్యూహాత్మకంగా స్వేచ్ఛనిస్తున్నారా?



న్యూఢిల్లీ,భారత్ – పాక్ మధ్య తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో దాయాదీని ఒంటరిని చేసి కొట్టాలనే వ్యూహంలో మోడీ ఉన్నారనే చర్చ సాగిన సంగతి తెలిసిందే. ఈ సమయంలో తాజాగా జరిగిన రెండు సంఘటనలు ఆ వాదనకు బలం చేకూరుస్తున్నాయని అంటున్నారు. అందులో ఒకటి అమెరికా వైస్ ప్రెసిడెంట్ జేడీ వాన్స్ ప్రకటన కాగా.. రెండోది ప్రపంచ బ్యాంక్ అధ్యక్షుడి ప్రకటన!అవును... ప్రపంచ వ్యాప్తంగా తాజాగా రెండు ఆసక్తికర పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఇందులో భాగంగా... తాజాగా ఓ కార్యక్రమంలో మాట్లాడిన జేడీ వాన్స్... పాకిస్థాన్ పై భారత్ కు కొన్ని ఫిర్యాదులు ఉన్నాయని, న్యూఢిల్లీ చర్యలకు పాక్ స్పందిస్తోందని.. పరిస్థితులు తగ్గుముఖం పట్టేలా చేయాలని మేము వీరిని ప్రోత్సహించగలం కానీ.. యుద్ధంలో మాత్రం తలదూర్చలేం అని అన్నారు.మరోవైపు... సింధూజలాల ఒప్పందం అమలును భారత్ నిలిపేసిన సంగతి తెలిసిందే. వాస్తవానికి సింధూ జలాల ఒప్పందానికి ప్రపంచ బ్యాంకు మధ్యవర్తిత్వంతోనే భారత్ – పాక్ ల మధ్య ఒప్పందం కుదిరింది. ఈ నేపథ్యంలో ప్రపంచ బ్యాంక్ అధ్యక్షుడు అజయ్ బంగా స్పందించారు. ఈ సందర్భంగా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.ఇందులో భాగంగా... భారత్ – పాక్ మధ్య సింధూ జలాల పంపకాల విషయంలో జరిగిన ఒప్పందంలో ప్రపంచబ్యాంకు జోక్యం చేసుకుని.. ఎలా పరిష్కరిస్తుందనే దానిపై చాలా ఊహాగానాలు వినిపిస్తున్నాయని.. అయితే, అవన్నీ అర్థం లేనివని అన్నారు. కాకపోతే ఈ బ్యాంక్ పాత్ర ఒక సహాయకుడిగా మాత్రమే ఉంటుందని స్పష్టం చేశారు.ఇక్కడ ఓ ఆసకికరమైన విషయం ఏమిటంటే... ప్రస్తుతం భారత పర్యటనలో ఉన్న ప్రపంచబ్యాంక్ అధ్యక్షుడు అజయ్ బంగా... గురువారం మోడీతో భేటీ అయ్యారు. శుక్రవారం ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆధిత్యనాథ్ ను కలిశారు. పలు కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు.దీంతో... మోడీ చాణక్యం ఫలితంగా... తాజా ఉద్రిక్తతల నేపథ్యంలో పాకిస్థాన్ ను మోరల్ గా కూడా దెబ్బతీసి, మరింత ఒంటరిని చేసేలా వరల్డ్ వ్యూహం నడుస్తుందా.. లేక, భారత్ కు ఎలాంటి ఆటంకాలు, నియమాలు లేని స్వేచ్ఛను ఇసుందా అనే చర్చ తెరపైకి వచ్చిందని అంటున్నారు.

# కుదింపే లక్ష్యమా?




విశాఖ : ఆంధ్రుల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలుస్తున్న విశాఖ ఉక్కుపై కేంద్ర ప్రభుత్వం కక్ష సాధింపు ధోరణితో వ్యవహరిస్తోందా? విశాఖ ఉక్కును ప్రైవేటీకరించి తీరాలన్న కేంద్ర ప్రభుత్వ సంకల్పానికి కార్మికులు ఏళ్లతరబడి నిరంతరాయంగా సాగిస్తున్న పోరాటం అడ్డంకిగా మారిన విషయం తెలిసిందే. కార్మికులను చీల్చడానికి, నయానా, భయానా లొంగదీసుకోవడానికి చేసిన ప్రయత్నాలు విఫలం కావడంతో తాజాగా సిబ్బంది సంఖ్యను గణనీయంగా కుదించడానికి కేంద్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కేంద్ర ఉక్కు మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ ఇటీవల పార్లమెంటులో ఇచ్చిన జవాబుకూడా ఈ భయాలను మరింత తీవ్రం చేసేదిగా ఉండటం గమనార్హం. గత నెలలో జరిగిన పార్లమెంటు సమావేశంలో విక్రమ్‌జిత్ సింగ్ అనే రాజ్యసభ సభ్యుడు అడిగిన ప్రశ్నకు రాతపూర్వకంగా ఇచ్చిన సమాధానంలో ఈ మేరకు పలు విషయాలను మంత్రి శ్రీనివాస్ వర్మ ప్రస్తావించారు. పబ్లిక్ రంగ సంస్థల్లో సిబ్బంది వివరాలు, ఖాళీల భర్తీకి సంబంధించి అడిగిన ప్రశ్నకు ఇచ్చిన జవాబులో వివిధ సంస్థల్లోని స్థితి గతులను మంత్రి పేర్కొన్నారు. అయితే, ఒక్క విశాఖఉక్కు విషయంలోనే రేషనలైజేషన్‌ను ప్రస్తావించిన కేంద్ర మంత్రి ప్లాంటు నిర్వహణకు 9,510 మంది సరిపోతారని చెప్పారు. ప్రస్తుతం 13,460 మంది విధులు నిర్వహి స్తున్నారని కూడా ఆ సమాధానంలోనే ఆయన తెలిపారు. దీంతో సిబ్బంది సంఖ్యను కుదించడానికి కేంద్రం ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్న ఆందోళనలు నెలకొన్నాయి.

మంత్రి ఏం చెప్పారు?

విశాఖ ఉక్కుకు మంజూరైన సిబ్బంది, ప్రస్తుతం ఉన్న సిబ్బంది, జరిగిన రిక్రూట్‌మెంట్ల వివరాలను టేబుల్ రూపంలో అందచేశారు. ఆ టేబుల్ కిందనే విశాఖ ఉక్కు పరిశ్రమలో రేషనలైజేషన్ కోసం ఒక అధ్యయనాన్ని నిర్వహించినట్లు, ఆ అధ్యయనంలో 7.3 మిలియన్ టన్నుల స్టీల్ ఉత్పత్తికి 9,510 మంది కార్మికులు (ఎగ్జిక్యూటివ్, నాన్ ఎగ్జిక్యూటివ్)లు సనిపోతారని తెలినట్లు పేర్కొన్నారు. ఎగ్జిక్యూటివ్‌లు 2,561 మంది, నాన్ ఎగ్జిక్యూటివ్‌లు 6,949 మంది సరిపోతారని కూడా ఆయన వివరించారు. మంత్రి ఇచ్చిన లెక్కల ప్రకారమే ప్రస్తుతం జనరల్ విభాగంలో 2,338 మంది, ఇతరుల్లో 2028 మంది ఎగ్జిక్యూటివ్స్ విధులు నిర్వహిస్తున్నారు. నాన్ ఎగ్జిక్యూటివ్స్ జనరల్ విభాగంలో 4,997 మంది, ఇతరుల్లో 4077 మంది ఉన్నారు. మంత్రి ఇచ్చిన సమాధానం ప్రకారం రెండు విభాగాల్లోనూ కోత పడనుంది. మంత్రి ఇచ్చిన సమాధానం ప్రకారమే ఈ ఏడాది 19,795 మంది సిబ్బంది విశాఖ ఉక్కుకు మంజూరయ్యారు. దీంతో పోల్చుకుంటే వేల సంఖ్యలో పోస్టులు ఖాళీఉన్నట్లు ఎవరికైనా ఇట్టే అర్ధమవుతుంది. అయితే, ఖాళీగా ఉన్న పోస్టుల సంఖ్యను మంత్రి తన సమాధానంలో సున్నాగా చూపించారు. దీంతో ఈ ఏడాది పోస్టుల భర్తీ ఉండదని తేలిపోయింది. దాంతో పాటు రేషన్‌లైజేషన్‌ను ప్రస్తావించడంతో ఉన్న సిబ్బందిలోనూ కోత పెట్టనున్నారన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

**యుద్ధం వేళ..పాక్ అసత్యప్రచారాలు**

న్యూఢిల్లీ, భారత్, పాకిస్తాన్ యుద్ధం నేపథ్యంలో పాకిస్తాన్ మీడియా, సోషల్ మీడియా తప్పుడు ప్రచారాలకు తెరలేపాయి. పెద్ద ఎత్తున అవాస్తవాలను ప్రచారం చేస్తున్నాయి. సోషల్ మీడియాలో పాకిస్తాన్‌కు చెందిన ప్రముఖులు సైతం తప్పుడు వీడియోలను, ఫొటోలను పోస్టు చేస్తున్నారు. భారత ప్రజల్ని భయభ్రాంతులకు గురి చేసే ప్రయత్నం చేస్తున్నారు. తప్పుడు ప్రచారాలపై ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ఉక్కుపాదం మోపుతోంది. నిజా నిజాలను బయటపెడుతోంది. మహ్మద్ అలీ రెజా రజు అనే వ్యక్తి తన ట్విటర్ ఖాతాలో ఓ వీడియోను షేర్ చేశాడు.

# మిస్ వరల్డ్ పోటీలకు భద్రత కట్టుదిట్టం

హైదరాబాద్ : మిస్ వరల్డ్ పోటీల ఈవెంట్‌ను ప్రభుత్వం ఎంతో ఛాలెంజింగ్‌తో నిర్వహిస్తోంది. ఒకవైపు ఇండియాపాకిస్తాన్ యుద్ధ వాతావరణంలో ఇప్పటికే ఐపిఎల్‌ను వారం పాటు బిసిసిఐ వాయిదా వేసింది. దేశ వ్యాప్తంగా హై అలర్ట్ ప్రకటించారు. ఈ పరిస్థితుల్లో మిస్ వరల్డ్ –2025 పోటీలను కట్టుదిట్టమైన భద్రతల నడుమ నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగాతీసుకున్న మిస్ వరల్డ్ పోటీలకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేసినట్లు మాదాపూర్ డిసిపి వినీత్ తెలిపారు.శనివారం గచ్చిబౌలి స్టేడియంలో గ్రాండ్ ఓపెనింగ్ సెర్మనీ ఉన్నందున ఈ కార్యక్రమనికి టూరిజం శాఖ పాస్‌లు ఉన్న వారికే అనుమతి ఉంటుందని ఆయన చెప్పారు. ఈవెంట్ కు సంబంధించి ప్రెస్ మీట్ లో ఆయన మాట్లాడారు. “స్టేడియంలో జరిగే ఈవెంట్‌కు 300 నుండి 350 మంది పోలీసులు బందోబస్తులో ఉంటారు. ఇప్పటి వరకు 103 మంది కంటెస్టెంట్స్ వచ్చినట్లు సమాచారం ఉంది. దేశ సరిహద్దులో జరుగుతున్న పరిణామాలను దృష్టిలో ఉంచుకొని టైట్ సెక్యురిటి ఏర్పాటు చేశాము. గచ్చిబౌలి స్టేడియం, హెచ్ఐసిసి, కంటెస్టెంట్స్ బస చేసే హొటల్స్ వద్ద భద్రత కట్టుదిట్టం



చేశాము. భద్రతకు సంబంధించి డీజీపీ, సైబరాబాద్ సిపి ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేస్తున్నారు” అని వెల్లడించారు. ఈవెంట్ నిర్వహిస్తున్న ఏరియాలో భారీ బందోబస్తు ఉంటుందని చెప్పారు. మాదాపూర్ పరిధిలో మొత్తం 500 మంది బందోబస్తులో ఉంటారని అన్నారు.

# బోర్డర్లో ఉద్రిక్తతలు.. సైబర్ నేరగాళ్ల నయా దందా స్టార్ట్ చేశారు!

హైదరాబాద్,భారత్ – పాకిస్థాన్ సరిహద్దుల్లో తీవ్ర ఉద్రిక్తతలు చోటు చేసుకున్న సంగతి తెలిసిందే. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా పాకిస్థాన్ లోని ఉగ్రవాదులే లక్ష్యంగా భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టింది. ఈ దాడుల్లో 100 మందికి పైగా ఉగ్రవాదులు హతమార్చబడ్డారు. అందుకు ప్రతీకారంగా భారత్ పై పాకిస్థాన్ క్షిపణి దాడులకు తెగబడుతుంది. భారత్ వాటిని తిప్పికొడుతుంది. మరోపక్క నియంత్రణ రేఖ వెంబడి పాకిస్థాన్ కాల్పుల విరమణ ఉల్లంఘనలకు పాల్పడుతుంది. ఈ సమయంలో భారత్ సైన్యం గట్టిగా బుద్ధి చెబుతోంది. ఇదే సమయంలో... సాధారణ పౌరులే లక్ష్యంగా సరిహద్దుల్లోని గ్రామాల్లో డ్రోన్ లను ప్రయోగిస్తూ రాక్షసానందం పొందుతుంది పాక్. ఇలా పాకిస్థాన్ చేస్తోన్న దుశ్చర్యలకు భారత్ గట్టిగా ప్రతీకారం తీర్చుకుంటుంది!మరోపక్క భారత్ లోని సరిహద్దు రాష్ట్రాల్లో హై అలర్ట్ ప్రకటించారు.. సుమారు 27 విమానాశ్రయాలను ప్రస్తుతానికి మూసేశారు! ఇక సెలవుల్లో ఉన్న సైనిక, పోలీసు, రైల్వే ఉద్యోగులకు అవి రద్దు చేశారు. ఈ స్థాయిలో ప్రభుత్వ చర్యలు చేపడుతోంది.. మరోపక్క ఫేక్ న్యూస్ లపై ప్రజలను అప్రమత్తం చేస్తుంది! ఈ సమయంలో సైబర్ నేరగాళ్లు ఎంటరయ్యారు.అవును... ప్రపంచం ఏమైపోతున్నా, దేశంలో ఎలాంటి పరిస్థితులు నెలకొన్నా ప్రజలను మోసం చేసుకునే విషయంలో తమ పని తమదే అన్నట్లుగా.. సరిహద్దుల్లో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న సమయంలోనూ సైబర్ నేరగాళ్లు సొమ్ము చేసుకునేందుకు సిద్ధమయ్యారు. తాజా పరిస్థితులను ఆసరాగా చేసుకుని కొత్త తరహా మోసాలకు పాల్పడుతున్నారు.



అవును... తాజా పరిస్థితులను ఆసరాగా చేసుకుని కొత్త తరహా మోసాలకు సైబర్ నేరగాళ్లు పాల్పడుతున్నారు. ఈ నేపథ్యంలో టీజీఎస్ ఆర్టీసీ ఎండీ, వీసీ సజ్జనార్ ఎక్స్ వేదికగా ఓ పోస్ట్ పెట్టారు. దీనిద్వారా ప్రజలను అప్రమత్తం చేశారు. సరిహద్దుల్లో ఉద్రిక్త పరిస్థితులను వివరిస్తూ.. సైబర్ నేరగాళ్ల విరాళాలు అడుగుతున్నరని సజ్జనార్ తెలిపారు. ఈ సందర్భంగా... “సరిహద్దుల్లో ఉద్రిక్తతల నేపథ్యంలో సైబర్ నేరగాళ్లు కొత్త దందాకు తెరలేపారు. ఆర్మీ అధికారులమంటూ సందేశాలు పంపుతూ.. అందిన కాడికి దండుకుంటున్నారు. ఇలాంటి నకిలీ ఆర్మీ అధికారుల పట్ల జాగ్రత్తగా ఉండండి. డొనేషన్ సందేశాలను నమ్మి డబ్బు చెల్లించకండి” అని సజ్జనార్ ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com